తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
జనంసాక్షి
www.janamsakshi.org
మెదక్ - మహబూబ్‌నగర్
సంగారెడ్డి | సిద్దిపేట
జోగులాంబ గద్వాల
వనపర్తి | నారాయణపేట
నాగర్ కర్నూల్
గురువారం
12 నవంబర్ 2026



ప్రైవేట్ ఆసుపత్రి
వైద్యుల నిర్లక్ష్యానికి రెండు నెలల పసికందు బలి..!



- మావా ఆసుపత్రి వైద్యుడి అరెస్ట్.. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న పోలీసులు
- ఆసుపత్రిని సీజ్ చేసి మూసివేయాలని బాధిత కుటుంబ సభ్యుల డిమాండ్
- జిల్లావ్యాప్తంగా ప్రైవేట్ ఆసుపత్రులపై ఆకస్మిక తనిఖీలు చేపట్టాలని విజ్ఞప్తి



కోహిర్, నవంబర్ 11 (జనంసాక్షి):
సంగారెడ్డి జిల్లా కోహిర్ పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో విషాదకర ఘటన చోటుచేసుకుంది. వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే తమ రెండు నెలల పసికందు మృతి చెందిందని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది.వివరాల్లోకి వెళితే.. కోహిర్ పట్టణంలోని మావా ప్రైవేట్ ఆసుపత్రిలో రెండు నెలల చిన్నారికి వైద్యం అందిస్తున్న క్రమంలో ఈ ఘటన చోటుచేసుకున్నట్లు తెలుస్తోంది. ఆసుపత్రి వైద్యుల నిర్లక్ష్యం వల్లే తమ బిడ్డ ప్రాణాలు కోల్పోయిందని ఆరోపిస్తూ చిన్నారి తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు కోహిర్ టౌన్ పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి సంబంధిత వైద్యుడిని అదుపులోకి తీసుకున్నారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలపై విచారణ చేపట్టారు.మరోవైపు మృతి చెందిన పసికందు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జహీరాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోస్టుమార్టం ప్రక్రియ పూర్తయిన అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. అప్పటివరకు తమ ఇంట్లో నవ్వులు పూయించిన చిన్నారి విగతజీవిగా మారడంతో తల్లిదండ్రులు, బంధువులు కన్నీరుమున్నీరుగా విలపించారు. కుటుంబ సభ్యుల రోదనలు అక్కడున్న వారిని కలచివేశాయి.

మావా ఆసుపత్రిని సీజ్ చేయాలి...

ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులు మీడియాతో మాట్లాడుతూ.. తమకు జరిగిన అన్యాయం మరే కుటుంబానికి జరగకూడదని ఆవేదన వ్యక్తం చేశారు. రెండు నెలల పసికందు మృతికి కారణమైన ఆసుపత్రి వైద్యుల నిర్లక్ష్యంపై పూర్తిస్థాయి విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. సంబంధిత మావా ఆసుపత్రిని తక్షణమే సీజ్ చేసి మూసివేయాలని జిల్లా కలెక్టర్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి (డీఎంహెచ్ఓ)ను కోరారు.

మిగతా 11లో..

పాలమూరు ఎత్తిపోతలపై
90% పనులు పూర్తయ్యాయని రుజువు చూపిస్తే.. వచ్చే ఎన్నికల్లో పోటీ కూడా చేయం!



- పాలమూరు ఎత్తిపోతలపై బీఆర్ఎస్‌కు ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాస్ రెడ్డి సవాల్
- కేసీఆర్ రాయలసీమను రతనాల సీమ చేస్తానన్నప్పుడు ఎందుకు మాట్లాడలేదు?

మహబూబ్‌నగర్ బ్యూరో, నవంబర్ 11 (జనంసాక్షి): పాలమూరు ఎత్తిపోతల పథకంలో 90 శాతం పనులు పూర్తయ్యాయని బీఆర్ఎస్ నాయకులు చెబుతున్న మాటలపై ప్రభుత్వ విప్, మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం నివాస్ రెడ్డి తీవ్ర స్థాయిలో స్పందించారు. మహబూబ్‌నగర్‌లో ఏర్పాటు చేసిన ప్రెస్ మీట్‌లో ఆయన బీఆర్ఎస్‌కు సవాల్ విసిరారు.

రుజువు చూపిస్తే పోటీ చేయం...

నిజంగా పాలమూరు ఎత్తిపోతల పథకంలో 90 శాతం పనులు పూర్తి అయ్యిందని రుజువు చూపిస్తే.. మేము వచ్చే ఎన్నికల్లో పోటీ కూడా చేయమని సంచలన వ్యాఖ్యలు చేశారు.

నీళ్లను ఆంధ్రకు ఇచ్చింది కేసీఆరే...

నీళ్లను చంద్రబాబు మెప్పు కోసం ఆంధ్రకు ఇచ్చారని బీఆర్ఎస్ నాయకులు ఆరోపిస్తున్నారని, ఒక ప్రాంతం నుంచి వచ్చిన నాయకుడు ఎవ్వరూ తమ వాటాను ఇతరులకు ఇవ్వరని, ఒక్క కేసీఆర్ తప్ప అని ఎద్దేవా చేశారు. అప్పట్లో కేసీఆర్ రాయలసీమను రతనాల సీమ చేస్తామని అన్నారని, అప్పుడు ఒక్క మాట కూడా ఎందుకు అనలేదని ప్రశ్నించారు.

జూరాల నుంచి శ్రీశైలానికి ఎందుకు మార్చారు?

పాలమూరు ఎత్తిపోతల పథకాన్ని జూరాల నుంచి కాకుండా శ్రీశైలం నుంచి ఎందుకు మార్చారో చెప్పాలని నిలదీశారు. ప్రాజెక్ట్ ఖర్చు పెంచుకోవాలన్న ఆశతోనే ఇట్లా మార్చారని ఆరోపించారు.

కృష్ణా నీటిపై మొదటి హక్కు నారాయణపేట, మఖ్తల్

రేవంత్ రెడ్డి సీఎం అయిన తర్వాత మఖ్తల్, నారాయణపేట, కొడంగల్ ఎత్తిపోతల పథకాన్ని చేపట్టారని తెలిపారు. కృష్ణా నీటిపై మొదటి అధికారం నారాయణపేట, మఖ్తల్ లకు మాత్రమే ఉందని స్పష్టం చేశారు.

పదేండ్లు రాజ్యం ఏలి ఎందుకు కృష్ణా నీళ్లు కొడంగల్‌కు ఇవ్వలేదని ప్రశ్నించారు. కొడంగల్ అభివృద్ధి జరుగుతుందంటే కేసీఆర్‌కు కళ్ళ మంట అని అన్నారు.



కేసీఆర్ ఫామ్‌హౌస్‌కు గోదావరి నీళ్లు.. పాలమూరుకు లేవు

మీరేమో కేసీఆర్ ఫామ్ హౌస్ వరకు గోదావరి నీళ్లు తెచ్చుకున్నారని, మరి బీఆర్ఎస్ నాయకులు ఎప్పుడైనా కేసీఆర్‌ను నీళ్ళ కోసం అడిగారా అని నిలదీశారు.

కొడంగల్‌లో నిజమైన అభివృద్ధి...

స్వాతంత్రం వచ్చిన తర్వాత కొడంగల్ ప్రాంతంలో నిజమైన అభివృద్ధి పనులకు ఇప్పుడే బీజం పడిందని అన్నారు. వలసలను ఆపడానికి 5 వేల ఎకరాల్లో పారిశ్రామిక పార్క్, కృష్ణా నీళ్లు కొడంగల్‌కు తీసుకువస్తున్నామని, వీటి కోసమే రేడియల్ రోడ్ వస్తుందని తెలిపారు.

శంషాబాద్ నుంచి కొడంగల్ దాకా వచ్చే పరిశ్రమల్లో ఎంతోమంది మన యువకులకు ఉపాధి అవకాశాలు వస్తాయని, అనుసంధానంగా అన్ని రకాల విద్యా సంస్థలు కూడా అక్కడ వస్తున్నాయని చెప్పారు. అక్కడ స్కిల్స్ నేర్చిన విద్యార్థులు అక్కడే ఉపాధి పొందే అవకాశం ఉంటుందని తెలిపారు.

కేసీఆర్ జహీరాబాద్‌లో పారిశ్రామిక వాడ పెట్టుకున్నారని, మరి మహబూబ్ నగర్‌కు అట్లాంటి ఏర్పాటు వద్దా అని ప్రశ్నించారు. పాలమూరు బిడ్డ సీఎంగా ఉన్నందునే ఇది సాధ్యం అవుతోందని స్పష్టం చేశారు.

పాలమూరు బిడ్డ సీఎం.. పాలమూరు అభివృద్ధే లక్ష్యం

పాలమూరు జిల్లా నుంచి వచ్చిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోనే పాలమూరుకు నీళ్లు, పరిశ్రమలు, ఉద్యోగాలు, రోడ్లు వస్తున్నాయని, బీఆర్ఎస్ పదేళ్లలో చేయలేనిది ప్రజా ప్రభుత్వం రెండేళ్లలో చేసి చూపిస్తోందని యెన్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు.

ఆరోగ్యకరమైన సమాజం నిర్మించడానికి ప్రతి ఒక్కరు ముందుండాలి





తూప్రాన్, నవంబర్ 11 (జనంసాక్షి): వ్యసనాలకు దూరంగా ఉంటూ ఆరోగ్యకరమైన సమాజం నిర్మించడానికి ప్రతి ఒక్కరు ముందుండాలని తూప్రాన్ మున్సిపల్ చైర్ పర్సన్ బొంది రజిని రవీంద్ర గౌడ్ తెలిపారు. మాదక ద్రవ్య రహిత దేశమే లక్ష్యంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏలూరు జిల్లాకు చెందిన ఇందుకూరి విజయలక్ష్మి భీమవరం నుండి ఢిల్లీ వరకు చేపట్టిన సైకిల్ యాత్ర బుధవారం రోజు తూప్రాన్ పట్టణానికి చేరుకుంది. ఈ సందర్భంగా గీతా కళాశాల యాజమాన్యం, విద్యార్థులు మరియు అధ్యాపకులు ఆమెకు ఘనస్వాగతం పలికారు.

అనంతరం విద్యార్థులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ.. వ్యసనాలకు దూరంగా ఉంటూ, ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించాలని సూచించారు. మున్సిపల్ చైర్ పర్సన్ రజిని రాఘవేందర్ గౌడ్ మాట్లాడుతూ సమాజం పట్ల బాధ్యతతో డ్రగ్స్ కి దూరంగా ఉంటూ తల్లి దండ్రుల కలలు నెరవేర్చాలని కోరారు.



ఎస్సై గంగరాజు మాట్లాడుతూ మాదక ద్రవ్యాలకు దూరంగా ఉంటూ శారీరక ఆరోగ్యాన్ని కలిగి ఉండి ప్రభుత్వ ఉద్యోగాలకు అర్హత సాధించాలన్నారు.



కళాశాల కరెస్పాండెంట్ రామాంజనేయులు మాట్లాడుతూ విద్యార్థులు మత్తును తరిమేసి ఉజ్వల భవిష్యత్తును వెలిగించుకోవాలని కోరారు.

ఈ కార్యక్రమంలో కళాశాల వైర్ పర్సన్ పి. ఉష, ప్రిన్సిపాల్ రాజు, వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్ రావు మరియు అధ్యాపకులు పాల్గొన్నారు.

దేశిని చిన్న మల్లయ్య సేవలు చిరస్మరణీయం

- ఘనంగా 9వ, వర్ధంతి వేడుకలు
- జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు, కంటస్టెడ్ ఎమ్మెల్సీ పిడిశెట్టి రాజు



కోహెడ, నవంబర్ 11 (జనంసాక్షి): ఇందుర్తి మాజీ ఎమ్మెల్యే దేశిని చిన్న మల్లయ్య గౌడ్ 9వ వర్ధంతి వేడుకలను జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు, కంటెస్టెడ్ ఎమ్మెల్సీ పిడిశెట్టి రాజు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా సర్పంచ్ బందెల సుజాత-బాలకిషన్ హాజరయ్యారు. చిన్న మల్లయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి, సాయికృష్ణ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో చిన్న మల్లయ్య కీలక పాత్ర పోషించారని, సీపీఐకి విశిష్ట సేవలందించారని కొనియాడారు. ఆయన పేరు మీద ప్రభుత్వం పథకం ప్రవేశపెట్టి ప్రాంత అభివృద్ధికి కృషి చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కోరారు. పలువురు సంఘ నాయకులు పాల్గొన్నారు.

నిజాంపేటలో దుర్గా భవాని ఫర్టిలైజర్ దుకాణం ప్రారంభం



నిజాంపేట్, నవంబర్ 11 (జనంసాక్షి): మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన దుర్గా భవాని ఫర్టిలైజర్ దుకాణాన్ని నారాయణఖేడ్ ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందించాలని, కల్తీ విత్తనాలు, నకిలీ ఎరువుల విక్రయాలకు దూరంగా ఉండాలని సూచించారు. రైతుల నమ్మకమే వ్యాపారానికి పెట్టుబడి అని, రైతులు బాగుంటేనే మండలం అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. దుకాణ యాజమాన్యానికి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు లింగారెడ్డి, కాంగ్రెస్ నాయకులు రాధాకిషన్, వడ్ల దుర్గయ్య, శ్రీకాంత్, రఘుపతిరెడ్డి, హమీద్ ఖాన్, కృష్ణ, పెంటయ్య తదితరులు పాల్గొన్నారు.

పది సీసీ కెమెరాల నిఘాలో పోరెడ్డిపల్లి గ్రామం

- నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు కీలకం: ఏసీపీ సదానందం

కోహెడ, నవంబర్ 11 (జనంసాక్షి): మండలంలోని పోరెడ్డిపల్లి గ్రామంలో సురక్ష నేత్ర కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన పది సీసీ కెమెరాలను బుధవారం హుస్నాబాద్ ఏసీపీ సదానందం, కోహెడ ఎస్ఐ అభిలాష్ స్థానిక సర్పంచ్ దబ్బెడ రజితతో కలిసి ప్రారంభించారు. కెమెరాల ఏర్పాటుకు సహకరించిన గ్రామస్తులను ఏసీపీ అభినందించారు.

ఈ సందర్భంగా ఏసీపీ సదానందం మాట్లాడుతూ హుస్నాబాద్ డివిజన్ పరిధిలోని అన్ని గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రజలు, ప్రజాప్రతినిధులు, వ్యాపారులు, వివిధ సంఘాల నాయకులు సహకరించాలని కోరారు. ఒక్క సీసీ కెమెరా 100 మంది పోలీసులతో సమానమని, కెమెరాలు ఏర్పాటు చేసిన ప్రాంతాల్లో నేరస్తులు నేరాలకు పాల్పడేందుకు వెనుకడుగు వేస్తారని తెలిపారు. ప్రజలకు భద్రతా భావం కల్పించడంలో సీసీ కెమెరాలు కీలకపాత్ర పోషిస్తాయని, వీటి సహాయంతో ఇప్పటికే ఎన్నో ముఖ్యమైన కేసులను ఛేదించినట్లు వివరించారు. అలాగే సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, సోషల్ మీడియాను అవసరమైన మేరకే వినియోగించాలని సూచించారు.



గంజాయి, ఇతర మత్తు పదార్థాల నిర్మూలనకు ప్రజల సహకారం అవసరమన్నారు. ముఖ్యంగా యువత, విద్యార్థుల ప్రవర్తనను తల్లిదండ్రులు ఎప్పటికప్పుడు గమనించాలని, వారిలో అనుమానాస్పద మార్పులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని హామీ ఇచ్చారు.



గ్రామంలో ఎక్కడైనా చట్టవ్యతిరేక కార్యకలాపాలు జరుగుతున్నట్లు గుర్తిస్తే వెంటనే పోలీసులకు లేదా డయల్ 112కు సమాచారం అందించాలని సూచించారు. ప్రజల రక్షణ కోసం పోలీసులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కోహెడ పోలీస్ సిబ్బంది, గ్రామ ప్రజలు, యువకులు, సీసీ కెమెరాల ఏర్పాటుకు సహకరించిన దాతలు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌నినో ప్రభావాలపై రైతులకు అవగాహన కార్యక్రమం

- పంటల మార్పిడి, నీటి సంరక్షణపై అధికారుల సూచనలు



కొల్చారం, నవంబర్ 11 (జనంసాక్షి): ఎల్‌నినో ప్రభావాల నేపథ్యంలో రైతులు ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించాలని, నీటి వనరులను పొదుపుగా వినియోగించుకోవాలని వ్యవసాయ శాఖ అధికారులు సూచించారు. కొల్చారం మండలంలోని వెంకటాపూర్ గ్రామపంచాయతీ, వాసురం తండాలో మంగళవారం గ్రామసభలు నిర్వహించి రైతులకు పంటల మార్పిడి, నీటి సంరక్షణ, వాతావరణ పరిస్థితులపై అవగాహన కల్పించారు.

ఈ సందర్భంగా వ్యవసాయ అధికారి శ్వేత కుమారి మాట్లాడుతూ.. భూగర్భ జలమట్టం తగ్గుతున్న నేపథ్యంలో నీటి లభ్యతను బట్టి తక్కువ నీటితో సాగయ్యే మొక్కజొన్న, జొన్న, పెసర, మినుము, అలసంద, పొద్దుతిరుగుడు, వేరుశనగ వంటి ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని సూచించారు. అనుకూలమైన భూముల్లో ఆయిల్‌పామ్ సాగుతో దీర్ఘకాలిక ఆదాయం పొందవచ్చని వివరించారు. డ్రిప్ ఇరిగేషన్ ద్వారా కూరగాయల సాగు చేపట్టాలని, ప్రభుత్వం అందిస్తున్న రాయితీలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ రైతులకు 90 శాతం, చిన్న, సన్నకారు, బీసీ రైతులకు 80 శాతం, ఇతర రైతులకు 70 శాతం సబ్సిడీపై డ్రిప్ పరికరాలు అందుబాటులో ఉన్నాయని వివరించారు.

ఎంపీడీవో రఫీక్ ఉన్నిసా మాట్లాడుతూ.. వి జి బి రామ్ పథకం ద్వారా గ్రామాల్లో నీటి సంరక్షణ, భూగర్భ జలాల పెంపునకు చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. ప్రతి ఇంటి వద్ద ఇంకుడు గుంతలు, గ్రామస్థాయిలో సోక్‌పిట్స్, వ్యవసాయ క్షేత్రాల్లో ఫార్మ్ పాండ్స్ నిర్మించుకొని వర్షపు నీటిని ఒడిసిపట్టుకోవాలని సూచించారు.

మిషన్ భగీరథ ఏఈ మాట్లాడుతూ ప్రతి ఇంటి నీటి కనెక్షన్‌కు ఆన్-ఆఫ్ వాల్వ్ ఏర్పాటు చేసుకొని అవసరమైనప్పుడు మాత్రమే నీటిని వినియోగించాలని, వృథాను అరికట్టాలని కోరారు. నీటి సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని అధికారులు పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో ఏపీవో మహిపాల్ రెడ్డి, ఎం పి ఓ పోచయ్య, మిషన్ భగీరథ ఏఈ, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ, విద్యుత్, ఇరిగేషన్ శాఖల అధికారులు, గ్రామ సర్పంచులు లక్ష్మి, వినోద్ నాయక్ ఉపసర్పంచులు రమావత్ సంతోష సుధాకర్ నాయక్, రైతులు పాల్గొన్నారు. వాతావరణ మార్పులకు అనుగుణంగా పంటల మార్పిడి చేపట్టి, నీటి పొదుపు పద్ధతులు పాటించడం ద్వారా వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుకోవాలని అధికారులు రైతులకు సూచించారు.

అప్పాజిపల్లిలో ఉచిత వైద్య శిబిరం



కొల్చారం, నవంబర్ 11 (జనంసాక్షి): కొల్చారం మండలం అప్పాజిపల్లి గ్రామంలో సర్పంచ్ నాయిని వెంకట్ గౌడ్ (గజిని) ఆధ్వర్యంలో గ్రామ పాలకవర్గం సహకారంతో సింధు హాస్పిటల్ వారు ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో గ్రామానికి చెందిన 115 మందికి ఈసీజీ, స్కానింగ్, గుండె సంబంధిత పరీక్షలు నిర్వహించారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో శిబిరం ఏర్పాటు చేసినట్లు ఆసుపత్రి మార్కెటింగ్ హెచ్ఓడీ చాగంటి శ్రీనివాస్ రెడ్డి, మేనేజర్ విజయ్ కుమార్ తెలిపారు. సర్పంచ్ ఈ సేవలను అభినందించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ చలం నర్సింలు, వార్డు సభ్యులు, గ్రామ కార్యదర్శి చింతల సురేందర్, ఫీల్డ్ అసిస్టెంట్ సత్యనారాయణ, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులను
వెంటనే రెగ్యులరైజ్ చేయాలి



సంగారెడ్డి, నవంబర్ 11(జనంసాక్షి): ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే రెగ్యులరైజ్ చేయాలని జన జాగృతి సేన అధ్యక్షుడు బంగారు కృష్ణ డిమాండ్ చేశారు. సంగారెడ్డిలో ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల సమ్మె 30వ రోజుకు చేరిన సందర్భంగా బుధవారం సమ్మె శిబిరాన్ని సందర్శించి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవుట్ సోర్సింగ్ ఏజెన్సీలను రద్దు చేసి, రెగ్యులర్ ఉద్యోగులకు వర్తించే సౌకర్యాలు కల్పించాలని కోరారు. 15 నుంచి 20 ఏళ్లుగా సేవ లందిస్తున్న ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయకపోవడం అన్యాయ మన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని, లేనిపక్షంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జేఏసీ జాయింట్ సెక్రటరీ నీలి శ్రీనివాస్, నామ నాయక్, జహంగీర్, చింతల సాయికుమార్ పాల్గొన్నారు.

పగలే వెలుగులు

- **పాలక మండలి లేదేమో మరీ**
- **నిద్ర మత్తులో అధికార గణాలు**



శివ్వంపేట, నవంబర్ 11 (జనంసాక్షి): రాత్రిపూట వెలగాల్సిన విధ్యుత్ వీధి దీపాలు పట్టపగలే వెలుగుతున్న వైనం శివ్వంపేట మండలంలోని దంతాన్ పల్లి గ్రామంలో గత కొంత కాలంగా ఈ విధంగానే జరుగుతుంది. ఈ గ్రామ పంచాయతీపై అధికారుల పర్యవేక్షణ పూర్తిగా కరువై పట్టపగలే విద్యుత్ స్తంభాలకు లైట్లు వెలుగుతున్నాయిని గ్రామస్థులు మండిపడుతున్నారు. నిర్లక్ష్యానికి నిలువుటద్దంలా పట్టపగలే వెలుగుతున్న వీధిదీపాలతో లక్షల రూపాయల విలు వైన విద్యుత్ వృధా కావడమే కాకుండా ప్రతి నెల నెల గ్రామ పంచాయతీ నిధుల నుండి వేల రూపాయల ప్రజాధనం కరెంట్ బిల్లుల రూపంలో చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడిందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు. పగలు, రాత్రి తేడా లేకుండా విద్యుత్ దీపాలు వెలుగుతుంటే సర్పంచ్ కానీ, పంచాయతీ కార్యదర్శి కానీ, పాలకవర్గం సభ్యులు గానీ కనీసం పట్టించుకున్న పాపాన పోవడం లేదని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ వినియోగం కోసం ప్రభుత్వం లక్షల రూపాయలు వెచ్చిస్తుంటే, విద్యుత్ ఆదా చేయాల్సిన సంబంధిత అధికారులు మాత్రం ఉద్యోగ ధర్మంలో పూర్తిగా నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నారని గ్రామ స్థులు వాపోయారు. ప్రతిరోజూ గ్రామంలో పర్యవేక్షించాల్సిన గ్రామ, మండల పంచాయతీ అధికారి పర్యవేక్షణ లోపంతోనే దం తాన్ పల్లి గ్రామంలో పట్టపగలు వీధిదీపాలు వెలుగుతున్నాయని గ్రామస్థులు ఆరోపించారు.

చెట్టుకు ఉరివేసుకుని వ్యక్తి ఆత్మహత్య



హత్నూర, నవంబర్ 11 (జనంసాక్షి): చెట్టుకు ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న విషాద కర ఘటన మండలంలోని సికింద్లాపూర్ గ్రామంలో బుధ వారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన ఎరుకల నర్సింలు (45) గ్రామ శివారు లోని చింతల కుంట కట్ట క్రింద వేప చెట్టుకు ఉరి వేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు.
ఆ ప్రాంతం వైపు పని కోసం వెళ్లిన ఉపాది హామీ కూలీలకు చెట్టుకు వేలాడుతున్న శవం కనిపించింది.మృతదేహాన్ని గుర్తిం చిన కూలీలు వెంటనే బాధిత కుటుంబీకులకు సమాచారం చేరవేశారు.మృత దేహాన్ని శవ పరీక్ష నిమిత్తం నర్సాపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.
అనంతరం కుటుంబీకులకు అప్పగించారు.మృతుడు నర్సింలు గత కొంతకాలంగా అప్పుల బాధతో ఇబ్బందులు పడుతున్నట్లు తెలిసింది.మృతుడికి భార్య కవిత,కుమారుడు ఉన్నారు.

కంది గ్రామ పంచాయతీలో ఐఐఎం ఇండోర్ బృందం క్షేత్రస్థాయి అధ్యయనం

- **గ్రామీణ వ్యర్థాల పరిమాణం, స్వభావంపై పరిశీలన**
- **నాలుగు రకాల చెత్త వర్గీకరణపై వివరాల సేకరణ**



సంగారెడ్డి బ్యూరో, నవంబర్ 11 (జనంసాక్షి): గ్రామీణ ప్రాంతాల్లో వ్యర్థాల నిర్వహణ విధానాలను మెరుగుపరిచే లక్ష్యంతో ఐఐఎం ఇండోర్ అధ్యయన బృందం బుధవారం సంగారెడ్డి జిల్లా కంది గ్రామ పంచాయతీని సందర్శించి క్షేత్రస్థాయి పరిశీలన నిర్వహించింది. కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో స్వచ్ఛ భారత్ మిషన్ గ్రామీణ్ కార్యక్రమంలో భాగంగా, యునిసెఫ్ సహకారంతో చేపట్టిన గ్రామీణ వ్యర్థాల పరిమాణం, స్వభావ విశ్లేషణ అధ్యయనంలో భాగంగా ఈ పర్యటన చేపట్టారు. ఇప్పటికే కాశీపూర్ గ్రామంలో అధ్యయనం పూర్తి చేసిన బృంద సభ్యులు బాలాజీ పసుపులేటి, ఆదిత్య పాటిదార్ కందిలో సర్పంచ్, వార్డు సభ్యులు, అంగన్‌వాడీ ఉపాధ్యాయులు, వైద్యాధికారి, మహిళా సంఘాల ప్రతినిధులతో సమావేశమై చెత్త సేకరణ, వర్గీకరణ, నిర్వహణ విధానాలపై వివరాలు సేకరించారు.
అనంతరం గ్రామంలోని ఇళ్లు, హోటళ్లు, దుకాణాలు, పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను సందర్శించి అక్కడ ఉత్పత్తి అవుతున్న వ్యర్థాల పరిమాణం, స్వభావాన్ని పరిశీలించారు. తడి చెత్త, పొడి చెత్త, పారిశుద్ధ్య వ్యర్థాలు, గృహాల్లోని హానికర వ్యర్థాలుగా నాలుగు రకాలుగా వేరు చేస్తున్న తీరును, మూలం వద్దే చెత్తను వర్గీకరించడంలో ఎదురవుతున్న సమస్యలను తెలుసుకున్నారు.
ఈ సందర్భంగా సర్పంచ్ చిన్నసాయి శ్రీరామ్ మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణ మెరుగుపడాలంటే ప్రతి ఇంట్లో, ప్రతి దుకాణంలో చెత్తను వేర్వేరుగా సేకరించాలని సూచించారు. ప్రజాప్రతినిధులు, మహిళా సంఘాలు, విద్యాసంస్థలు, ప్రజల సమన్వయంతో నాలుగు రకాల చెత్త వర్గీకరణను సమర్థవంతంగా అమలు చేయాలన్నారు. ఈ అధ్యయనం భవిష్యత్తులో గ్రామాల్లో ఘన వ్యర్థాల నిర్వహణ వ్యవస్థను మెరుగుపరచడానికి దోహదపడుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి మహేందర్ రెడ్డి, వైద్యాధికారి డాక్టర్ మౌనిక, స్వచ్ఛ భారత్ మిషన్ సమన్వయకర్త స్వామి, పంచాయతీ కార్యదర్శి కవిత, వార్డు సభ్యులు, అంగన్‌వాడీ ఉపాధ్యాయులు, మహిళా గ్రామ సమాఖ్య ప్రతినిధులు, సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అల్పాహార విందు ప్రారంభం



కొల్చారం, నవంబర్ 11 (జనంసాక్షి): ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు పౌష్టికాహారం అందించడంతో పాటు, ఉదయం పాఠశాలకు రాగానే అల్పాహారం అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాన్ని కొల్చారం మండలంలోని కొంగోడు, నాయిని జలాల్పూర్ గ్రామాల్లో ప్రారంభించారు.
కొంగోడు గ్రామ సర్పంచ్ దుబ్బగళ్ల స్వామి, నాయిని జలాల్పూర్ గ్రామ సర్పంచ్ దేవిసింగ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు, విద్యార్థుల సమక్షంలో అల్పాహార విందు కార్యక్రమాన్ని ప్రారంభించారు. విద్యార్థులకు ఉదయమే పోషక విలువలతో కూడిన అల్పాహారం అందించడం వల్ల ఆరోగ్యంతో పాటు చదువుపై ఏకాగ్రత పెరుగుతుందని వారు పేర్కొన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.



ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రామేశ్వర ప్రసాద్, ప్రవీణ్, సిద్ధయ్య, ఉపసర్పంచులు సిద్ధిరాములు, వెంకట నరసింహులు, మండల నాయకులు గంపల లక్ష్మయ్య, కురుమ యాదగిరి, కొంగోడు అంగన్‌వాడీ టీచర్ మంజుల, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి బలమైన పునాదులు వేసిన ఆజాద్

- **ఆజాద్ ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని**
- **ఘనంగా మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి వేడుకలు**
- **తార ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రవీణ**





సంగారెడ్డి బ్యూరో, నవంబర్ 11 (జనంసాక్షి): జాతీయ విద్యా దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం సంగారెడ్డిలోని తారా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ప్రవీణ ఆజాద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ.. స్వతంత్ర భారతదేశ తొలి విద్యాశాఖ మంత్రిగా మౌలానా అబుల్ కలాం ఆజాద్ దేశ విద్యారంగ అభివృద్ధికి విశేష కృషి చేశారని తెలిపారు. ఉన్నత విద్యాసంస్థల స్థాపనకు, విశ్వవిద్యాలయాల మంజూరు సంఘం ఏర్పాటుకు బలమైన పునాదులు వేశారని పేర్కొన్నారు. విద్యతోనే ప్రపంచాన్ని మార్చగలమని విశ్వసించిన ఆజాద్ ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. వ్యక్తిగత అభివృద్ధితో పాటు సమాజ, దేశ ప్రగతికి విద్య ఎంతో కీలకమని ఆయన సేవలను కొనియాడారు.

ఇబ్బందుల్లో ఉన్న మూడు కుటుంబాలకు ఉప్పల వెంకటేష్ అండ

- **ఇంటి నిర్మాణానికి సిమెంట్ అందజేత..**

కల్వకుర్తి,నవంబర్ 11,(జనంసాక్షి): కల్వకుర్తిమున్సిపాలిటీ పరిధిలో ఇంటి నిర్మాణ పనులు సిమెంట్ లేక నిలిచిపోయి ఇబ్బందులు ఎదుర్కొంటున్న మూడు కుటుంబాలకు బీఆర్ఎస్ నాయకుడు, రాష్ట్ర మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్, ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ సిమెంట్ అందజేసి అండగా నిలిచారు.
పట్టణంలోని 16వ వార్డు శివాలయం కాలనీకి చెందిన శ్వేత, 9వ వార్డు రాధాకృష్ణ కాలనీకి చెందిన శేఖర్, మహేష్ తమ ఇళ్ల నిర్మాణానికి సిమెంట్ అవసరమని ఉప్పల వెంకటేష్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ మాజీ స్పెషల్ నామినేటెడ్ పర్సన్ కుడుముల మనోహర్ రెడ్డి, మైనార్టీ సీనియర్ నాయకుడు ఖాజా,బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

మెలిగిరిపేటలో ఘనంగా ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశం



సదాశివపేట, నవంబర్ 11(జనంసాక్షి): సదాశివపేట మండలం మెలిగిరి పేట గ్రామానికి చెందిన మంగలి చంద్రయ్య నూతన ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ వేడుక ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ షాబుద్దీన్ ముఖ్య అతిథిగా హాజరై చంద్రయ్య కుటుంబ సభ్యులకు శు భాకాంక్షలు తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం నిరుపేదల సొంతిం టి కలను సాకారం చేస్తోందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్‌ను గ్రామస్తులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

విద్యతోనే సమాజ, దేశ ప్రగతి

- **విద్యకు ప్రతి ఒక్కరూ ప్రాధాన్యత ఇవ్వాలి**
- **ఘనంగా జాతీయ విద్యా దినోత్సవ వేడుకలు**



సంగారెడ్డి బ్యూరో, నవంబర్ 11 (జనంసాక్షి): విద్య సమాజ అభివృద్ధికి, దేశ ప్రగతికి పునాది అని జిల్లా అదనపు కలెక్టర్లు పాండు, సంగీత పేర్కొన్నారు. స్వాతంత్ర్య సమరయోధుడు, దేశ తొలి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ దేశానికి అందించిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు.
జాతీయ విద్యా దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం మైనారిటీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సంగారెడ్డి కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్లు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిం చారు. అనంతరం వారు మాట్లాడుతూ.. భారత తొలి ప్రధాన మంత్రి జవహర్‌లాల్ నెహ్రూ మంత్రివర్గంలో తొలి విద్యాశాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వహించిన ఆజాద్, దేశంలో ఉన్నత విద్యాసంస్థల స్థాపనకు, విశ్వవిద్యాలయాల నిధుల సంఘం ఏర్పాటుకు, సాంకేతిక, శాస్త్రీయ విద్యాభివృద్ధికి విశేష కృషి చేశారని తెలిపారు. విద్య ద్వారానే ప్రపంచాన్ని మార్చగలమని ఆయన విశ్వసించారని గుర్తుచేశారు. ప్రతి ఒక్కరూ విద్యకు ప్రాధాన్యతనిస్తూ, ఆయన ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగాలని సూచించారు.
ఈ కార్యక్రమంలో గృహ నిర్మాణ శాఖ జిల్లా అధికారి చలపతిరావు, వివిధ శాఖల జిల్లా అధికారులు, మైనారిటీ సంక్షేమ శాఖ, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యా రంగానికి మౌలానా అబుల్ కలాం ఆజాద్ చేసిన సేవలు చిరస్మరణీయం

- ఘనంగా మౌలానా అబుల్ కలాం ఆజాద్ 138వ జయంతి వేడుకలు
- నేటి యువతకు మౌలానా అబుల్ కలాం ఆజాద్ జీవితం ఆదర్శనీయం
- జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్



మెదక్ బ్యూరో, నవంబర్ 11 (జనంసాక్షి): విద్యా వైతాళికుడు, భారతదేశ తొలి విద్యా శాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ జీవితం నేటి యువతకు ఆదర్శనీయమని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అన్నారు. బుధవారం, జిల్లా సమీకృత కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో లిమౌలానా అబుల్ కలాం ఆజాద్ 138వ జయంతిలి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ హాజరై, మౌలానా అబుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి జ్యోతి ప్రజ్వలన గావించి, పూలమాలలు సమర్పించి, ఘనంగా నివాళులర్పించారు. ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. 1923లో కేవలం 35 సంవత్సరాల వయసులోనే ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీకి అతి పిన్న వయస్కుడైన అధ్యక్షుడిగా మౌలానా అబుల్ కలాం ఆజాద్ ఎన్నికయ్యారని తెలిపారు. ఆయన జయంతి రోజును జాతీయ విద్యా దినోత్సవంగా నిర్వహించుకుంటున్నామని పేర్కొన్నారు. దేశ తొలి విద్యా శాఖ మంత్రిగా విద్యారంగ అభివృద్ధికి, విద్యా సంస్కరణలకు ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని కొనియాడారు. ఆధునిక విద్యా విధానాలు, విద్యా ప్రణాళికల రూపకల్పనలో ఆయన కీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు.

అప్పటివరకు అమలులో ఉన్న విద్యా విధానాల్లో మార్పులు తీసుకువచ్చి, దేశ అవసరాలకు అనుగుణంగా నూతన విద్యా విధానానికి పునాదులు వేశారని వెల్లడించారు. మౌలానా అబుల్ కలాం ఆజాద్ ఆశయాలు, దేశభక్తి, విద్యారంగానికి ఆయన చేసిన సేవలను నేటి యువత స్ఫూర్తిగా తీసుకొని, విద్యకు ప్రాధాన్యతనిస్తూ దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఎంతో ఉన్నతమైన వ్యక్తిత్వం కలిగినప్పటికీ ఎలాంటి స్వార్థం లేకుండా దేశ సేవకే తన జీవితాన్ని అంకితం చేశారని పేర్కొన్నారు. స్వాతంత్ర్య ఉద్యమంలో చురుకుగా పాల్గొని, ఎన్ని సవాళ్లు ఎదురైనా వెనుకడుగు వేయకుండా దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడారని తెలిపారు. దేశానికి ఆయన అందించిన విశిష్ట సేవలను గుర్తించి, భారత ప్రభుత్వం అత్యున్నత పౌర పురస్కారమైన 'భారతరత్న'తో సత్కరించిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మౌలానా ఆజాద్ సేవలు చిరస్మరణీయం



కోహీర్, నవంబర్ 11 (జనంసాక్షి): మౌలానా అబుల్ కలాం ఆజాద్ దేశానికి, విద్యారంగానికి అందించిన సేవలు చిరస్మరణీయమని మండల విద్యాధికారి మహమ్మద్ జాకీర్ హుస్సేన్ అన్నారు. కోహీర్ మండలంలోని దిగ్వాల్ జడ్పీహెచ్ఎస్‌తో పాటు వివిధ పాఠశాలల్లో జాతీయ విద్యా దినోత్సవం, మైనారిటీల సంక్షేమ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. దిగ్వాల్ పాఠశాలలో ఆజాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఎంఈఓ మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధుడిగా, దేశ తొలి విద్యాశాఖ మంత్రిగా విద్యావ్యవస్థ అభివృద్ధికి ఆయన చేసిన కృషి మరువలేనిదన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్ఎం శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి



నిజాంపేట్, నవంబర్ 11 (జనంసాక్షి): గొర్రెకల్ గ్రామ శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో కొత్తపల్లికి చెందిన శివశంకర్ (23) మృతి చెందగా, మరో ఇద్దరు యువకులు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. వివరాల్లోకి వెళితే.. శివశంకర్ తన స్నేహితులు శ్రీకాంత్, మహేష్‌తో కలిసి పుట్టినరోజు వేడుకకు కేక్ తీసుకెళ్లి తిరిగి వస్తుండగా వారి వాహనం ప్రమాదానికి గురైంది. ఈ ఘటనతో కొత్తపల్లి గ్రామంలో విషాదం నెలకొంది.

బీఎస్పీకి వాకిటి అంజనేయులు ముదిరాజ్ రాజీనామా



మక్తల్, నవంబర్ 11 (జనంసాక్షి): బీఎస్పీ నారాయణపేట జిల్లా మాజీ అధ్యక్షుడు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వాకిటి అంజనేయులు ముదిరాజ్ పార్టీకి రాజీనామా చేశారు. రాజీనామా లేఖను రాష్ట్ర అధ్యక్షుడు ఇబ్రహీం శేఖర్‌కు పంపినట్లు తెలిపారు. సీనియర్ నాయకులకు పార్టీలో గుర్తింపు లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇకపై జ్యోతిరావు పూలే బీసీ సంఘం వ్యవస్థాపక కుడిగా బహుజనుల హక్కుల కోసం పోరాడుతానని ప్రకటించారు.

తిమ్మయిపల్లిలో వడ్ల కొనుగోలు కేంద్రం ప్రారంభం



నంగునూరు, నవంబర్ 11(జనంసాక్షి): నంగునూరు మండలం తిమ్మయిపల్లి గ్రామంలో పాలమాకుల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బుధవారం రోజున ఏఎంసీ చైర్మన్ దేవులపల్లి యాదగిరి, పీఏసీఎస్ చైర్మన్ ఎల్లంకి మైపాల్ రెడ్డి, గ్రామ సర్పంచ్ చేర్యాల రాజు ఆధ్వర్యంలో ఘనంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు పండించిన ప్రతి గింజనూ మద్దతు ధరకు కొనుగోలు చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఈ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిందన్నారు. దళారులను ఆశ్రయించి నష్టపోకుండా, ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలను ఉపయోగించుకుని మద్దతు ధర పొందాలని సూచించారు. ధాన్యంలో తేమ శాతం నిబంధనల ప్రకారం ఉండేలా చూసుకుని, నాణ్యమైన ధాన్యాన్ని కేంద్రాలకు తీసుకురావాలని కోరారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కేంద్రంలో తగిన ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్, వార్డ్ సభ్యులు, మాజీ సర్పంచ్లు, వ్యవసాయ శాఖ అధికారులు, సొసైటీ సిబ్బంది, హమాలి నాయకులు స్థానిక వివిధ పార్టీల నాయకులు, రైతులు పాల్గొన్నారు.

నిరుపేద మౌనిక నరేష్ కుటుంబానికి 120 గజాల స్థలం దానం



రామాయంపేట, నవంబర్ 11 (జనంసాక్షి): ఆపదలో ఉన్న నిరుపేద కుటుంబానికి ఆర్.వెంకటాపూర్ గ్రామానికి చెందిన ద్యావడి గోవర్ధన్ రెడ్డి, సతీష్ రెడ్డి కుటుంబం అండగా నిలిచింది. భర్త నరేష్‌ను కోల్పోయి కష్టాల్లో ఉన్న మౌనిక నరేష్ ముదిరాజ్ కుటుంబానికి 120 గజాల స్థలాన్ని దానం చేసి మానవత్వం చాటుకున్నారు. ఈ భూదానం నిరుపేద కుటుంబానికి భవిష్యత్తుపై భరోసా కల్పించింది. నరేష్ అంత్యక్రియల ఖర్చుల కోసం సర్పంచ్ ఉమా సంజీవరెడ్డి, గ్రామ పెద్దలు, స్నేహితులు ఆర్థిక సహాయం అందించారు. కులమతాలు, రాజకీయాలకు అతీతంగా ఆపదలో ఉన్నవారికి అండగా నిలవడం అభినందనీయమని ముదిరాజ్ సంఘం నాయకులు పేర్కొన్నారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు మరెందరికో స్ఫూర్తిగా నిలవాలని, స్థలం దానం చేసిన గోవర్ధన్ రెడ్డి, సతీష్ రెడ్డి కుటుంబంతో పాటు సహాయం అందించిన వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

ఖిల్లాలో అండర్‌గ్రౌండ్ డైనేజీ పనులు ప్రారంభించిన సర్పంచ్ ఆగారం పద్మమ్మ ప్రకాష్



ఖిల్లా ఘనపురం, నవంబర్ 11 (జనంసాక్షి): మండల కేంద్రంలోని స్థానిక వార్డులో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులను బుధవారం గ్రామ సర్పంచ్ ఆగారం పద్మమ్మ ప్రకాష్ కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. కాలనీవాసుల అభ్యర్థన మేరకు డ్రైనేజీ పనులు చేపట్టినట్లు ఈ సందర్భంగా తెలిపారు.గ్రామ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామని, ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించేందుకు ప్రాధాన్యత ఇస్తామని అగారం ప్రకాష్ పేర్కొన్నారు.

అనంతరం మహిళా సమాఖ్య భవనం ప్రాంగణంలో రూ. 1.50 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న మరుగుదొడ్ల పనులను పరిశీలించి, పనుల పురోగతిని పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ సత్యం, గ్రామ పంచాయతీ కార్యదర్శి రవికుమార్, వార్డు సభ్యులు మహేందర్, లింగస్వామి, జ్యోతి, నగేష్, వెంకటేష్, గిరి తదితరులు పాల్గొన్నారు.

సర్కారు బడుల్లో ఉచిత అల్పాహార పథకం ప్రారంభం



కొడిపల్లి, నవంబర్ 11 (జనంసాక్షి): మండలంలోని అన్ని ప్రాథమిక ఉన్నత పాఠశాలలలో బుధవారం రోజున సీఎం బ్రేక్ ఫాస్ట్ ఉచిత అల్పాహార పథకాన్ని ఆయా గ్రామాల సర్పంచ్ లు, ఉప సర్పంచ్‌లు ఎస్ఎంసి చైర్మన్లు, వార్డు మెంబర్లు, ఆయా గ్రామాల ముఖ్య నాయకులు కలిసి పాఠశాలల్లో విద్యార్థులకు అల్పాహారాన్ని పంపిణీ చేశారు. కొడిపల్లిలోని ప్రాథమిక, ఉన్నత పాఠశాలలలో మండల సర్పంచ్ల ఫోరం అధ్యక్షుడు, గ్రామ సర్పంచ్ చంద్రం కృష్ణ గౌడ్, ఉప సర్పంచ్ శ్వేతా మల్లికార్జున గౌడ్, ఎస్ఎంసి చైర్మన్, గ్రామ నాయకులు కలిసి అల్పాహారం అందించారు. అదేవిధంగా మండలంలోని వివిధ పాఠశాలలలో కొట్టాల గ్రామంలో సర్పంచ్ సుమలత రవి, వెల్మకన్నలో సర్పంచ్ కుమ్మరి శివలీల సతీష్, తునికి పాఠశాలలో ఎంఈఓ బాలరాజు, వివిధ గ్రామాలలో సర్పంచ్లు, గ్రామ నాయకుల ఆధ్వర్యంలో అల్పాహారాన్ని పంపిణీ చేశారు.

మెదక్‌కు వెళ్లి.. స్వగ్రామానికి వస్తూ



పాపన్నపేట, నవంబర్ 11 (జనంసాక్షి): వైద్యం కోసం జిల్లా కేంద్రానికి వెళ్లి స్వగ్రామానికి తిరిగి వస్తున్న ఓ వ్యక్తి తిరిగిరాని లోకానికి చేరాడు. ఈ విషాద సంఘటన సీతానగర్ గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్ఐ శ్రీనివాస్ గౌడ్ కథనం మేరకు.. గ్రామానికి చెందిన మన్నె సత్తయ్య (54) వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. కాగా గర్భవతిగా ఉన్న తన కూతురు అశ్వినిని వైద్య పరీక్షల కోసం ఈ నెల 9న తన ద్విచక్ర వాహనంపై మెదక్‌కు తీసుకువెళ్లాడు. తిరిగి వచ్చే క్రమంలో యూసుఫ్ పేట గ్రామ శివారులో కోయ్య గుండు వద్ద ఎదురుగా అతివేగంగా వచ్చిన కారు వీరి బైక్‌ను ఢీ కొట్టింది. ఇద్దరు కింద పడగా సత్తయ్యకు తీవ్ర,అశ్విని కీ స్వల్ప గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం ఇద్దరిని అంబులెన్సులో మెదక్ లోని ప్రభుత్వ హాస్పిటల్ కు తరలించారు. అక్కడి నుండి హైదరాబాద్ లోని ఓ ప్రైవేటు హాస్పిటల్ కు,అనంతరం గాంధీ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం అర్ధ రాత్రి సత్తయ్య మృతి చెందాడు.మృతుడి కూమార్తె అశ్విని ఫిర్యాదు మేరకు కేసు నమోదైంది.

విద్యార్థుల్లో సృజనాత్మకతకు బాలోత్సవం దోహదం

- బాలోత్సవ ఆహ్వాన పత్రికను విడుదల చేసిన ఎమ్మెల్యే కసిరెడ్డి



కల్వకుర్తి, నవంబర్ 11 (జనంసాక్షి): విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసి, సృజనాత్మకత, ఆత్మవిశ్వాసం, సామాజిక అవగాహన పెంపొందించేందుకు బాలోత్సవాలు ఎంతగానో దోహదపడతాయని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. విద్యార్థులు చదువుతోపాటు సాంస్కృతిక, సాహిత్య, కళారంగాల్లోనూ రాణించేలా ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు. కల్వకుర్తిలో నిర్వహించనున్న బాలోత్సవానికి సంబంధించిన ఆహ్వాన పత్రికను ఎమ్మెల్యే విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బాలోత్సవం విద్యార్థుల కళా నైపుణ్యాలు, వక్తృత్వ ప్రతిభ, ఆలోచనా శక్తిని వెలికితీసే మంచి వేదికగా నిలుస్తుందని తెలిపారు. విద్యార్థులు పాఠ్యాంశాలకే పరిమితం కాకుండా సామాజిక అంశాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. బాలోత్సవాన్ని విజయవంతం చేసేందుకు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు సహకరించాలని నిర్వాహకులు కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బృంగి రత్నమాల, వైస్ చైర్మన్ షానవాజ్ ఖాన్, నిర్వాహకులు ఏపీ మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ అమలు చేయాలి

నంగునూరు, నవంబర్ 11 (జనంసాక్షి): సెప్టెంబర్ 1, 2004కు ముందు ఉద్యోగ నోటిఫికేషన్ వెలువడి, ఆ తర్వాత విధుల్లో చేరిన 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానం (ఓపీఎస్) అమలు చేయాలని నంగునూరు మండల 2003 డీఎస్సీ పాత పెన్షన్ సాధన సమితి నాయకులు సింగిరెడ్డి రమణారెడ్డి, అనుమల వీరేశం డిమాండ్ చేశారు.





బుధవారం నంగునూరులో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం జీవో నంబర్ 158 ద్వారా అర్హులైన ఉపాధ్యాయులకు పాత పెన్షన్ వర్తింపజేసిందని, తెలంగాణ ప్రభుత్వం కూడా అదే విధంగా న్యాయం చేయాలని కోరారు. 2015లో మెమో 6996 ద్వారా ఉపాధ్యాయుల వివరాలు సేకరించినప్పటికీ పదేళ్లుగా నిర్ణయం తీసుకోకపోవడం విచారకరమన్నారు. నోటిఫికేషన్ తేదీని ప్రాతిపదికగా తీసుకొని పాత పెన్షన్ అమలు చేస్తూ వెంటనే ఉత్తర్వులు జారీ చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో డీఎస్సీ ఉపాధ్యాయులు గడీల శ్రీకాంత్, జైపాల్ యాదవ్, కొత్తపల్లి రవి, రామకృష్ణ, రాములు, నిమ్మ భాస్కర్ రెడ్డి, మట్ట శ్రీకాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జలసిరి పనుల్లో వేగం పెంచండి -

అధికారులకు అడిషనల్ DRDO బాలరాజ్ ఆదేశం

- మూడు గ్రామాల్లో జలసిరి పనులను క్షేత్రస్థాయిలో తనిఖీ చేసిన అధికార బృందం

సిర్గాపూర్, నవంబర్ 11 (జనంసాక్షి): గ్రామాల్లో ప్రతి ఇంటికి సురక్షిత తాగునీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని, జలసిరి పనుల్లో ఎక్కడా నిర్లక్ష్యం వహించవద్దని అడిషనల్ DRDO బాలరాజ్ అధికారులను హెచ్చరించారు. బుధవారం సిర్గాపూర్ మండలంలోని సుల్తానాబాద్, చిన్నముబారక్ పూర్, బొక్కస్ గావ్ గ్రామాల్లో అడిషనల్ DRDO బాలరాజ్, APD విజయ లక్ష్మి, ఎంపీడీఓ అండలమ్మలు పర్యటించి జలసిరి పనులను క్షేత్రస్థాయిలో తనిఖీ చేశారు. మూడు గ్రామాల్లో నిర్మాణంలో ఉన్న నీటి ట్యాంకులు, పైప్ లైన్ పనులు, ఇంటింటికి కనెక్షన్ల పురోగతిని వారు స్వయంగా పరిశీలించారు. పనులు జరుగుతున్న తీరు, వాడుతున్న మెటీరియల్ నాణ్యతను అడిగి తెలుసుకున్నారు. అసంపూర్తిగా ఉన్న పనులను గడువులోగా పూర్తి చేయాలని, నాణ్యత విషయంలో రాజీపడవద్దని సంబంధిత అధికారులకు, కాంట్రాక్టర్లకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.



గ్రామాల్లో తాగునీటి సమస్య శాశ్వతంగా పరిష్కారం అయ్యేలా పనులు చేపట్టాలని, ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చూడాలని సూచించారు. పనులు పూర్తయిన తర్వాత ప్రతి ఇంటికి నీరు అందుతుందో లేదో మళ్ళీ తనిఖీ చేస్తామని తెలిపారు.ఈ పర్యటనలో ఎంపీఓ, ఏపీఓ, సంబంధిత గ్రామాల సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, పాల్గొన్నారు.

మౌలానా ఆజాద్ ఆశయాలతోనే దేశాభివృద్ధి సాధ్యం!

- మహబూబ్‌నగర్‌ను విద్యా, పారిశ్రామిక కేంద్రంగా తీర్చిదిద్దుతాం
- ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి





మహబూబ్‌నగర్ బ్యూరో, నవంబర్ 11(జనంసాక్షి): ఆల్ మేవా సంస్థ ఆధ్వర్యంలో మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా ప్రభుత్వ విప్, మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి హాజరై మౌలానా అబుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

ఈ సందర్భంగా యెన్నం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. మౌలానా అబుల్ కలాం ఆజాద్ ఆశయాలతోనే దేశాభివృద్ధి సాధ్యమని స్పష్టం చేశారు. స్వాతంత్ర్య పోరాటంలో, భారత విద్యా వ్యవస్థ అభివృద్ధిలో ఆజాద్ సేవలు చిరస్మరణీయమని కొనియాడారు.

విద్య, ఉపాధి, మౌలిక వసతుల కల్పనే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. బాలికల విద్యకు ప్రాధాన్యం ఇవ్వాలని, విద్యతోనే కుటుంబాలు, సమాజం అభివృద్ధి చెందుతాయని అన్నారు. విద్య, సాంకేతిక పరిజ్ఞానానికి ప్రాధాన్యమిచ్చిన దేశాలే ప్రపంచస్థాయిలో అభివృద్ధి సాధించాయని పేర్కొన్నారు.

మహబూబ్‌నగర్‌ను విద్యా, పారిశ్రామిక కేంద్రంగా తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో మహబూబ్‌నగర్ జిల్లా అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నామని చెప్పారు. జిల్లాలో విద్యాసంస్థలు, ఆధునిక శిక్షణ కేంద్రాల ఏర్పాటుతో యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామని, పారిశ్రామిక పార్కుల అభివృద్ధితో స్థానిక యువతకు ఉద్యోగాలు కల్పించడమే లక్ష్యమని తెలిపారు. మైనారిటీ విద్యాసంస్థల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని అన్నారు.

మహబూబ్‌నగర్ నగరంలో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని, నగర తాగునీటి సమస్య పరిష్కారానికి రూ.220 కోట్లతో 14 ఓవర్‌హెడ్ రిజర్వాయర్ల నిర్మాణం చేపట్టామని వెల్లడించారు. రాబోయే 20-25 ఏళ్ల అవసరాలను దృష్టిలో ఉంచుకుని తాగునీటి సదుపాయాల విస్తరణ చేస్తున్నామని తెలిపారు. ఎన్నికల కోసం కాదు.. భవిష్యత్ తరాల అభివృద్ధి కోసం పనిచేస్తున్నామని, మహబూబ్‌నగర్‌ను విద్య, పరిశ్రమలు, ఉపాధి, మౌలిక వసతులకు కేంద్రంగా తీర్చిదిద్దుతామని స్పష్టం చేశారు. వచ్చే మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి నాటికి ఆయన విగ్రహం, సమావేశ మందిరం ఏర్పాటుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. మౌలానా ఆజాద్ ఆశయాలకు అనుగుణంగా సమానత్వం, మత సామరస్యం, విద్యాభివృద్ధి కోసం అందరూ కలిసి పని చేయాలని పిలుపునిచ్చారు.

హైదరాబాద్ - రాయచూరు

మార్గంలో ప్రత్యేక ప్యాసింజర్ రైళ్లు నడపాలి

- బీఆర్ఎస్ నేత రామలింగం విజ్ఞప్తి

మక్తల్, నవంబర్ 11 (జనంసాక్షి): హైదరాబాద్ నుంచి రాయచూరు వరకు ప్రతినిత్యం ఉదయం, మధ్యాహ్న సమయాల్లో ప్రత్యేకంగా రెండు ప్యాసింజర్ రైళ్లను నడపాలని కోరుతూ దక్షిణ మధ్య రైల్వే డివిజనల్ రైల్వే మేనేజర్ సంతోష్ కుమార్ వర్మను బీఆర్ఎస్ పార్టీ మక్తల్ నేత రామలింగం కలిసి వినతిపత్రం అందజేశారు.



ఈ సందర్భంగా రామలింగం మాట్లాడుతూ.. కొత్త రైల్వే మార్గం అందుబాటులోకి వచ్చి మూడేళ్లు గడుస్తున్నా, ప్రయాణికులకు తగినట్లుగా రైలు సౌకర్యాలు లేవని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం కేవలం సాయంత్రం పూట మాత్రమే ఒక్క ప్యాసింజర్ రైలు నడుస్తుండటంతో ప్రయాణికులు, ముఖ్యంగా కర్ణాటక సరిహద్దు ప్రాంత ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆయన దృష్టికి తీసుకెళ్లారు.

ఉపాధి, వ్యాపారం, వైద్యం నిమిత్తం హైదరాబాద్ వెళ్లే సాధారణ ప్రజలకు ప్రస్తుత రైలు వేళలు సరిపోవడం లేదని, దీనివల్ల ప్రజలు ఎక్కువ దూరం ప్రయాణించి తీవ్ర నష్టాలను ఎదుర్కొంటున్నారని వివరించారు. కావున ప్రయాణికుల సౌకర్యార్థం ఉదయం 10 గంటలకు, మధ్యాహ్నం 2 గంటలకు హైదరాబాద్ – రాయచూరు మార్గంలో ప్రత్యేక ప్యాసింజర్ రైళ్లను వెంటనే ప్రారంభించాలని ఆయన కోరారు. రామలింగం విజ్ఞప్తిపై DRM సంతోష్ కుమార్ వర్మ సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. ప్రజాసమస్యలను పరిశీలించి, త్వరలోనే తగిన పరిష్కారం చూపుతామని DRM హామీ ఇచ్చినట్లు రామలింగం వెల్లడించారు.

ఇందిరమ్మ ఇండ్ల ప్రారంభోత్సవం, గృహప్రవేశాలు

కె.టి దొడ్డి, నవంబర్ 11(జనంసాక్షి): పేద ప్రజల ఎన్నో ఏళ్ల సొంతింటి కలను సీఎం రేవంత్ రెడ్డి గారి నాయకత్వంలోని ప్రజాపాలన ప్రభుత్వం నెరవేర్చిందని గద్వాల నియోజకవర్గ శాసనసభ్యులు శ్రీ బండ్ల కృష్ణమోహన్ రెడ్డి గారు అన్నారు. బుధవారం గద్వాల నియోజకవర్గం, కె.టి దొడ్డి మండల పరిధిలోని సుల్తానాపురం, కుచినెర్ల, కె.టి దొడ్డి గ్రామాల లో నిర్మాణం పూర్తి చేసుకున్న ఇందిరమ్మ ఇండ్ల ప్రారంభోత్సవం మరియు నూతన గృహప్రవేశ కార్యక్రమాలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సుల్తానాపురం గ్రామానికి చెందిన లబ్ధిదారుడు ఆంజనేయులు, కుచినెర్ల గ్రామానికి చెందిన లబ్ధిదారుడు కురువ ముని, కె.టి దొడ్డి గ్రామానికి చెందిన లబ్ధిదారుడు జంగిలప్పల నూతన గృహాలను ఎమ్మెల్యే బండ్ల రిబ్బన్ కట్ చేసి ఘనంగా ప్రారంభించారు. అనంతరం గృహప్రవేశం చేసిన లబ్ధిదారులకు ఎమ్మెల్యే గారు ప్రత్యేక కానుకలను అందజేసి వారి కుటుంబ సభ్యులకు హార్దిక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు



ఎమ్మెల్యే గారిని శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేసి తమ కృతజ్ఞతలు చాటుకున్నారు.

ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ యార్డ్ చైర్మన్ హనుమంతు, మాజీ ఎంపీపీ విజయ్, మాజీ వైస్ ఎంపీపీ రామకృష్ణ నాయుడు, సర్పంచులు కావేరి మల్లికార్జున్, కృష్ణ, నారాయణ, తిక్కన్న, పార్టీ ముఖ్య నాయకులు ఉరుకుందు, మైలగడ్డ చంద్రశేఖర్, యుగేందర్ గౌడ్, హరి ప్రసాద్ గౌడ్, వెంకటేష్, నారాయణ రెడ్డి, వీరన్న, వీరేష్‌లతో పాటు పలువురు స్థానిక నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే ప్రధాన లక్ష్యం....

- సహకార రంగం అభివృద్ధికి కృషి చేయాలి: ఎస్.ఏ. సంపత్ కుమార్

అయిజ, నవంబర్ 11 (జనంసాక్షి): అయిజ ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం పీఏసీఎస్ సింగిల్ విండో చైర్మన్‌గా సంకాపురం సుజాత రాముడు, వైస్ చైర్మన్‌గా దేవేందర్ ప్రమాణ స్వీకారం చేశారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏఐసీసీ కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఎస్.ఏ. సంపత్ కుమార్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి మాస్టర్ షేక్షవలి ఆచారి పాల్గొన్నారు. సంపత్ కుమార్ మాట్లాడుతూ.. గతంలో సంకాపురం రాముడు చేసిన సేవలను గుర్తించి, సుజాత రాముడు కి చైర్మన్ బాధ్యతలు అప్పగించడం సంతోషకరమన్నారు. రైతుల సంక్షేమమే ప్రధాన లక్ష్యంగా పీఏసీఎస్ పనిచేయాలని, రైతులకు అవసరమైన రుణాలు, ఎరువులు, విత్తనాలు అందించడంలో సహకార సంఘం కీలక పాత్ర పోషించాలని సూచించారు. రైతుల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ వాటి పరిష్కారానికి కృషి చేయాలని అన్నారు.



నూతన చైర్మన్ సంకాపురం సుజాత రాముడు మాట్లాడుతూ,తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. రైతులకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తానని, పీఏసీఎస్ ద్వారా రైతులకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తానని తెలిపారు.

రైతుల అభివృద్ధి, సహకార సంఘం బలోపేతమే లక్ష్యంగా చైర్మన్, వైస్ చైర్మన్ కలిసి పనిచేయాలని కార్యక్రమానికి హాజరైన నాయకులు ఆకాంక్షించారు.

భూముల రీసర్వే పారదర్శకంగా, పకడ్బందీగా చేపట్టాలి

- నవంబర్ నెలాఖరులోగా తొలి విడత సర్వే పూర్తి చేయాలి
- జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి



మెదక్ బ్యూరో, నవంబర్ 11 (జనంసాక్షి): రాష్ట్రంలో భూముల రీసర్వే ప్రక్రియను ప్రజలకు మేలు జరిగేలా, పూర్తి పారదర్శకతతో, నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా నిర్వహించాలని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అధికారులను ఆదేశించారు. తొందరపాటుతో తప్పులకు తావివ్వకుండా జాగ్రత్తలు తీసుకోవాలని స్పష్టం చేశారు. బుధవారం హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి రీసర్వే పురోగతిపై సమీక్షించారు. మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్, అదనపు కలెక్టర్ నగేష్ ఐడీఓసీ నుంచి ఈ సమావేశంలో పాల్గొన్నారు.

నవంబర్ నెలాఖరులోగా తొలి విడతలో ఎంపిక చేసిన 70 గ్రామాలతో పాటు నక్షా లేని గ్రామాల్లో రీసర్వే పూర్తి చేయాలని మంత్రి లక్ష్యంగా నిర్దేశించారు. ప్రతి మండలంలో ప్రత్యేక సర్వే బృందాలను ఏర్పాటు చేసి, లైసెన్స్‌డ్ సర్వేయర్ల సేవలను



వినియోగించుకోవాలని సూచించారు. రైతులకు ముందస్తు సమాచారం ఇచ్చి, వారి సమక్షంలోనే సర్వే నిర్వహించాలని, అభ్యంతరాలను స్వీకరించి ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఆదేశించారు. అసైన్డ్ భూముల పట్టాల నిజానిజాలు, భూముల విస్తీర్ణం, క్షేత్రస్థాయి పరిస్థితులను క్షుణ్ణంగా పరిశీలించాలని తెలిపారు. రీసర్వే పూర్తయిన గ్రామాల్లో వివరాలను ప్రజలకు తెలియజేసి, కొత్త పట్టాదారు పాస్ పుస్తకాలను క్యూఆర్ కోడ్‌తో అందించనున్నట్లు వెల్లడించారు. రీసర్వేలో అక్రమాలకు, అవకతవకలకు పాల్పడే అధికారులపై సస్పెన్షన్‌తో పాటు క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని మంత్రి హెచ్చరించారు. రాబోయే ఏడాదిన్నరలో మూడు విడతల్లో రాష్ట్రవ్యాప్తంగా రీసర్వే పూర్తి చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

చిట్టి చేతుల్లో.. పాదుపు సూత్రాలు



పాపన్నపేట, నవంబర్ 11 (జనంసాక్షి): చిట్టి చేతుల్లో ప్ల కార్డులు పట్టి పొదుపు సూత్రాలు వివరించారు. బుధవారం పాపన్నపేట జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు యూత్ అండ్ ఈకో క్లబ్ ఆధ్వర్యంలో పాపన్నపేట సంతలో కూరగాయల విక్రయదారులు, రైతులకు, మండల ప్రజలకు ఎల్‌నినోపై అవగాహన కల్పించారు. నీటిని, విద్యుత్‌ను పొదుపుగా వాడాలన్నారు. ప్రతి ఒక్కరూ పర్యావరణాన్ని రక్షించాలని నినాదాలు చేస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఉపాధ్యాయులు గిర్ని అంజాగౌడ్, మోహన్ రావు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నేరాల నియంత్రణకు

సీసీ కెమెరాలు దోహదం

- చేర్యాల సీఐ బానోతు రమేష్ నాయక్
- చిట్యాల గ్రామంలో సీసీ కెమెరాల ప్రారంభం



చేర్యాల, నవంబర్ 11 (జనంసాక్షి): చేర్యాల మండలం చిట్యాల గ్రామంలో సర్పంచ్ జానకి కృష్ణలీల స్వామి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను బుధవారం చేర్యాల సీఐ బానోతు రమేష్ నాయక్, ఎస్సై గూడ అపూర్వ రెడ్డి ప్రారంభించారు. నేరాలు, దొంగతనాల కట్టడికి సీసీ నిఘా ఎంతో మేలని పేర్కొన్నారు. అనంతరం రోడ్డు భద్రతపై అవగాహన కల్పిస్తూ సిబ్బందికి హెల్మెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కార్యదర్శి లోకేశ్వ రెడ్డి, ఉప సర్పంచ్ కనకయ్య, హెచ్ఎం లక్ష్మణ్, వార్డు సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

గుండుమాల్ టీఎస్‌సీపీఎస్ఈయూ మండల కమిటీ ఏకగ్రీవ ఎన్నిక



గుండుమాల్, నవంబర్ 11 (జనంసాక్షి): తెలంగాణ రాష్ట్ర కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ ఎంప్లాయీస్ యూనియన్ (టీఎస్‌సీపీఎస్ ఈయూ) గుండుమాల్ మండల నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నారాయణపేట జిల్లా అధ్యక్షుడు ఎన్. కృపాకర్ రెడ్డి ఆదేశాల మేరకు ఎన్నికలు నిర్వహించారు.

ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు మహా దేవ్, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు ఎం. మునెప్ప మాట్లాడుతూ సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని (ఓపీఎస్) పునరుద్ధరించే వరకు ఉద్యోగులంతా ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం నవంబర్ 17న చేపట్టనున్న సామూహిక సెలవుల నిరసనను విజయవంతం చేయాలని కోరారు. నూతన అధ్యక్షుడిగా జి. రామకృష్ణ, ప్రధాన కార్యదర్శిగా సుధాకర్ రెడ్డి, అసోసియేట్ అధ్యక్షుడిగా కాశప్ప, ఉపాధ్యక్షులుగా ప్రవంతి, రాజు, కోశాధికారిగా తిరుపతి, కార్యదర్శిగా ప్రశాంత్, కో-ఆర్డినేటర్‌గా శ్రీనివాస్, ప్రచార కార్యదర్శిగా కె. నరేష్, మహిళా కన్వీనర్‌గా స్వప్న ఎన్నికయ్యారు. సమావేశంలో మండల సీపీఎస్ ఉద్యోగులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎల్‌నినో ప్రభావాలపై రైతులకు అవగాహన

కౌడిపల్లి, నవంబర్ 11 (జనంసాక్షి): మెదక్ జిల్లా కౌడిపల్లి మండలం శేరితండా, ధర్మసాగర్ గేట్ తండాల్లో ఎల్‌నినో ప్రభావాల నేపథ్యంలో రైతులకు అవగాహన కల్పించేందుకు గ్రామసభలు నిర్వహించారు. రానున్న వర్షాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రత్యామ్నాయ పంటల సాగు, నీటి సంరక్షణ చర్యలపై వివిధ శాఖల అధికారులు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఏడీఏ పుణ్యవతి మాట్లాడుతూ భూగర్భ జలాల లభ్యతను బట్టి పంటలు ఎంపిక చేసుకోవాలని సూచించారు. తక్కువ నీటితో సాగయ్యే మొక్కజొన్న, జొన్న, పెసర, మినుము, అలసంద, పొద్దుతిరుగుడు, వేరుశనగ పంటలు సాగు చేయాలని తెలిపారు. మండల వ్యవసాయ అధికారి స్వప్న, ఏఈఓ నరేందర్ వర్షపాత పరిస్థితులు, విత్తనాలు విత్తే సమయంపై వివరించారు.

ఉద్యానవన శాఖ అధికారి మహేశ్వరి మాట్లాడుతూ కూరగాయల సాగుకు బిందు సేద్యం వినియోగించుకోవాలని, రైతులకు 70 నుంచి 90 శాతం వరకు రాయితీలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఎంపీడీఓ శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రతి ఇంటి వద్ద ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలని, వ్యవసాయ కుంటల ద్వారా వర్షపు నీటిని నిల్వ చేసుకోవాలని సూచించారు. మిషన్ భగీరథ అధికారులు నీటి వృథాను అరికట్టాలని కోరారు. తహసీల్దార్ కృష్ణ మాట్లాడుతూ భవిష్యత్తు అవసరాల కోసం



నీటిని పొదుపుగా వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, గ్రామ సర్పంచులు, రైతులు పాల్గొన్నారు.

ప్రతి గ్రామానికి బస్సు సౌకర్యమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం

- దాచక్‌పల్లిలో కొత్త ఆర్టీసీ బస్సును జెండా ఊపి ప్రారంభించిన ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాస్ రెడ్డి



హన్వాడ నవంబర్ 11(జనంసాక్షి): ప్రతి గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మహబూబ్‌నగర్ నుంచి హన్వాడ మండలం బుద్దారం గ్రామానికి నూతనంగా ఏర్పాటు చేసిన ఆర్టీసీ బస్సును దాచక్‌పల్లిలో ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ బస్సు బోయపల్లి, మహ్మద్ ఖాన్‌పల్లి, వెంకటమ్మ కుంట తండా, కొత్తపేట, దాచక్‌పల్లి, గుడ్డిమల్కాపూర్, టంకర, బుద్దారం మీదుగా హన్వాడకు వెళ్లి, రోజుకు రెండు ట్రిప్పులు నడుస్తుందని తెలిపారు. దీంతో 18 ఏళ్ల నాటి గ్రామాల కల సాకారమైందన్నారు.

మహిళలకు ఉచిత బస్సు, గృహజ్యోతి కింద 200 యూనిట్ల ఉచిత విద్యుత్, సన్నబియ్యం పంపిణీతో ప్రజా ప్రభుత్వం సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని చెప్పారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ మారేపల్లి సురేందర్ రెడ్డి , బుద్దారం సుధాకర్ రెడ్డి ఎన్.పి. వెంకటేష్ , హన్వాడ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు వి. మహేందర్ గారు, సర్పంచ్ శ్రీలత కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.





మౌలానా అబుల్ కలాం ఆజాద్ సేవలు చిరస్మరణీయం

- మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి నివాళులు



వనపర్తి బ్యూరో, నవంబర్ 11 (జనంసాక్షి):
భారతదేశ తొలి విద్యాశాఖ మంత్రి, స్వాతంత్ర్య సమరయోధుడు మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి సందర్భంగా మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ఘనంగా నివాళులర్పించారు. తన స్వగృహంలో మాజీ ఎమ్మెల్యేలు ఆల వెంకటేశ్వర్ రెడ్డి, బీరం హర్షవర్ధన్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆజాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ.. మౌలానా అబుల్ కలాం ఆజాద్ దేశ తొలి విద్యాశాఖ మంత్రిగా విద్యారంగ అభివృద్ధికి విశేష కృషి చేశారని కొనియాడారు. విద్యావ్యవస్థలో అనేక సంస్కరణలకు పునాది వేసి, భావితరాల భవిష్యత్తుకు బాటలు వేశారని పేర్కొన్నారు. స్వాతంత్ర్య సమరయోధుడిగా, గొప్ప కవిగా, బహుభాషా కోవిదుడిగా దేశానికి ఆయన అందించిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. దేశ నిర్మాణంలో, ముఖ్యంగా విద్యారంగ అభివృద్ధిలో ఆజాద్ పోషించిన పాత్ర ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని నిరంజన్ రెడ్డి పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు ఆల వెంకటేశ్వర్ రెడ్డి, బీరం హర్షవర్ధన్ రెడ్డితో పాటు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అసంపూర్తి రోడ్డుతో ప్రజలకు నరకం..

- వెయ్యి మందితో పాదయాత్రకు బీఆర్ఎస్ సిద్ధం!
- నెల రోజుల్లో పనులు ప్రారంభించకపోతే గంగాపూర్ నుంచి బాలానగర్ వరకు పాదయాత్ర





బాలానగర్, నవంబర్ 11 (జనంసాక్షి): బాలానగర్ మండల కేంద్రం నుంచి గౌతాపూర్, బోడజానంపేట, వనమోని గూడ, అప్పాజిపల్లి, బోడగుట్ట తండా, పెద్దరేవల్లి, తిరుమలగిరి, లింగంపేట మీదుగా గంగాపూర్ వరకు చేపట్టిన డబుల్ బీటీ రోడ్డు నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించాలని బీఆర్ఎస్ నాయకుడు, మండల సర్పంచుల సంఘం మాజీ అధ్యక్షుడు తిరుపతి నాయక్ డిమాండ్ చేశారు.
బుధవారం అప్పాజిపల్లిలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మంజూరైన ఈ రోడ్డు పనులు ఏడాదిలో పూర్తి కావాల్సి ఉండగా, మూడేళ్లు గడిచినా అసంపూర్తిగానే ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్డు నిర్మాణం పూర్తికాక రైతులు, విద్యార్థులు, పరిశ్రమలకు వెళ్లే కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. కల్వర్టుల నిర్మాణం అసంపూర్తిగా ఉండటంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, కంకర తేలిన రోడ్డుపై ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారని పేర్కొన్నారు.
వాయల్ కుంట మాజీ సర్పంచ్ గోపి నాయక్ మాట్లాడుతూ ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారెంటీలను పూర్తిస్థాయిలో అమలు చేయాలని, మహిళలకు రూ.2,500, కళ్యాణలక్ష్మి కింద తులం బంగారం, పింఛన్ల పెంపు, రైతు బీమా, రైతు భరోసా హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. నెల రోజుల్లోగా రోడ్డు పనులు ప్రారంభించకపోతే డిసెంబర్ చివరి వారంలో లేదా జనవరి మొదటి వారంలో వెయ్యి మందితో గంగాపూర్ నుంచి బాలానగర్ వరకు పాదయాత్ర చేపడతామని తిరుపతి నాయక్ హెచ్చరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు బాలు నాయక్, మాజీ సర్పంచులు, వార్డు సభ్యులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

బ్యాంకు సేవలను సద్వినియోగం చేసుకోవాలి

- నారాయణఖేడ్ యూనియన్ బ్యాంకులో 108వ వార్షికోత్సవ వేడుకలు



నారాయణఖేడ్ నవంబర్ 11 (జనంసాక్షి): నేటి ఆధునిక యుగంలో బ్యాంకులు కేవలం డబ్బు దాచుకునే ప్రదేశాలు మాత్రమే కావు. ప్రతి పౌరుడి ఆర్థిక అభివృద్ధికి దోహదపడే సేవా కేంద్రాలు. అయితే, గ్రామీణ ప్రాంతాల్లో ఇప్పటికీ చాలా మంది ప్రజలు బ్యాంకు సేవల గురించి పూర్తిగా తెలియక నష్టపోతున్నారు. అందుకే ప్రతి ఒక్కరూ బ్యాంకు సేవలను ఖాతాదారులు, రైతులు సద్వినియోగం చేసుకోవాలని యూనియన్ బాంక్ మేనేజర్ వి. స్వరూప్ కుమార్ అన్నారు.బుధవారం ప్రాంతీయ కార్యాలయంలో పూజ కారక్రమాలు నిర్వహించి ఖాతా దారులకు స్వీట్ లు, పంచి పెట్టారు ఈ సందర్భంగా బ్యాంకు మేనేజర్ వి. స్వరూప్ కుమార్ మాట్లాడుతు
బ్యాంకులో ఖాతా తెరవడం వల్ల డబ్బు భద్రంగా ఉంటుంది. ఇంట్లో దాచుకుంటే దొంగతనం జరిగే ప్రమాదం ఉంటుంది. బ్యాంకులో దాచుకుంటే వడ్డీ కూడా వస్తుంది. అంతేకాకుండా ప్రభుత్వం అందించే పథకాలు, పెన్షన్, రైతు భరోసా వంటి డబ్బులు నేరుగా బ్యాంకు ఖాతాలోనే జమ అవుతున్నాయి.
నేడు బ్యాంకులు ఎన్నో సేవలు అందిస్తున్నాయి. పొదుపు ఖాతా, రుణ సౌకర్యం, ఏటీఎం, ఫోన్ పే, గూగుల్ పే వంటి డిజిటల్ చెల్లింపులు, బీమా, ఫిక్స్‌డ్ డిపాజిట్ వంటివి వాటిలో ముఖ్యమైనవి. చిన్న వ్యాపారులు, రైతులు తక్కువ వడ్డీకే రుణాలు పొంది తమ వ్యాపారాన్ని అభివృద్ధి చేసుకోవచ్చు. వడ్డీ వ్యాపారుల వద్ద అధిక వడ్డీకి అప్పు తీసుకొని ఇబ్బంది పడాల్సిన అవసరం లేదు.
ముఖ్యంగా విద్యార్థులు, మహిళలు బ్యాంకు సేవలను వినియోగించుకోవాలి. మహిళల కోసం ప్రత్యేక పొదుపు పథకాలు, స్వయం సహాయక సంఘాలకు రుణాలు అందుబాటులో ఉన్నాయి. డిజిటల్ లావాదేవీలు చేయడం వల్ల మోసాలు తగ్గుతాయి. ప్రతి లావాదేవీకి రశీదు లభిస్తుంది.
అయితే బ్యాంకు సేవలు వాడుకునేటప్పుడు జాగ్రత్తలు కూడా తీసుకోవాలి. ఎవరికీ ఓటీపీ, పిన్ నంబర్ చెప్పకూడదు. బ్యాంకు అధికారులు ఎప్పుడూ ఫోన్ చేసి ఓటీపీ అడగరు. అపరిచిత లింకులపై క్లిక్ చేయకూడదు. పాస్ బుక్, చెక్ బుక్ జాగ్రత్తగా భద్రపరుచుకోవాలి అన్నారు.
ఈ కార్యక్రమంలో వి. స్వరూప్ కుమార్ – సీనియర్ మేనేజర్ (బి.హెడ్) సార్, రాజు పి. – మేనేజర్ (డిప్యూటీ బి.హెడ్) సార్ జి. పుల్లయ్య – స్పెషల్ సిఎస్ఏ,శ్రీకాంత్ డి. – సీనియర్ సిఎస్ఏ,కె. మేఘన రెడ్డి – సిఎస్ఏ, కిషోర్ – సబ్ స్టాఫ్,అంబదాస్ – సబ్ స్టాఫ్,ఎ. రామకృష్ణ – గోల్డ్ అప్రైసల్, కొమ్ముల జ్ఞానానందం – ఎస్.యు.డి లైఫ్ ఇన్సూరెన్స్, ఖాతాదార్లు, బ్యాంకు సిబంది తదితరులు పాల్గొన్నారు.

దైవ చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుంది

- బీజేపీ రాష్ట్ర నాయకులు ముచ్చర్ల జనార్దన్ రెడ్డి

ఉర్కొండ, నవంబర్ 11 (జనంసాక్షి); దైవచింతన తోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని ప్రతి ఒక్కరూ దైవ భక్తిని కలిగి ఉండాలని బిజెపి రాష్ట్ర నాయకులు నాగర్ కర్నూల్ జిల్లా కబడ్డీ అసోసియేషన్ చైర్మన్ ముచ్చర్ల జనార్దన్ రెడ్డి అన్నారు. ఊర్కొండ మండలంలోని రాచాలపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని కళ్యాతండాలో నిర్వహించిన ముత్యాలమ్మ పండుగ వేడుకలో ముచ్చర్ల జనార్దన్ రెడ్డి పాల్గొన్నారు. బీజేపీ మండల నాయకులు రవి నాయక్ ఆధ్వర్యంలో ఈ వేడుకలు ఘనంగా జరిగాయి.
ఈ సందర్భంగా ముచ్చర్ల జనార్దన్ రెడ్డి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, గ్రామ ప్రజలందరూ సుఖశాంతులతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రార్థించారు. భక్తులతో కలిసి వేడుకల్లో పాల్గొని వారికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కొమ్ము శ్రీను, సందీప్ కుమార్, దుబ్బ రాములు, బండి మల్లేష్, ఆంజనేయులు, ప్రసాద్ నాయక్, కుమార్ నాయక్, ప్రవీణ్ నాయక్ మరియు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ఆర్.గార్లపాడులో నూతన రేషన్ దుకాణం



ఎర్రవల్లి, నవంబర్ 12 (జనంసాక్షి):
ఎర్రవల్లి మండలం ఆర్.గార్లపాడులో నూతన రేషన్ దుకాణం ప్రారంభమైంది. జిల్లా గ్రంథాలయ చైర్మన్ నీలి శ్రీనివాసులు, సింగిల్ విండో చైర్మన్ మధు నాయుడు ఈ దుకాణాన్ని ప్రారంభించారు. కార్డుదారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా నిత్యావసర సరుకులు అందించాలని వారు నిర్వాహకులకు సూచించారు. పేద ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని వారు పేర్కొన్నారు. గ్రామంలోనే రేషన్ సరుకులు అందుబాటులోకి రావడంతో స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. సరుకుల పంపిణీలో పారదర్శకత పాటించాలని, తూకంలో ఎలాంటి తేడాలు రాకుండా చూడాలని అధికారులు హెచ్చరించారు. అర్హులైన ప్రతి పేదవానికి ప్రభుత్వ పథకాలు అందేలా కృషి చేస్తామని నాయకులు తెలిపారు. అనంతరం గ్రామస్థులకు రేషన్ బియ్యం, ఇతర నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు టి. నర్సిరెడ్డి, సర్పంచ్ తిమ్మారెడ్డి, స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు గ్రామస్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

పీఎం శ్రీ జెడ్పీహెచ్ఎస్‌లో జాతీయ విద్యా దినోత్సవం



మల్దకల్, నవంబర్ 11 (జనంసాక్షి):
మండల కేంద్రంలోని పీఎం శ్రీ జెడ్పీహెచ్ఎస్‌లో మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతిని జాతీయ విద్యా దినోత్సవంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యాభివృద్ధికి ఆజాద్ చేసిన సేవలను కొనియాడారు. నాణ్యమైన విద్య, సమాన అవకాశాలతోనే సమాజ, దేశాభివృద్ధి సాధ్యమని ఉపాధ్యాయులు తెలిపారు. విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదలతో లక్ష్యాలను సాధించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈఓ జి. సురేష్, ఇన్‌చార్జి హెచ్ఎం యు. రాజేశ్వర్ రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నూతన వాల్మీకి మహర్షి ఆలయ నిర్మాణానికి రూ.1,00,116 విరాళం అందజేత

- మాజీ జడ్పీటీసీ బాసు శ్యామల హనుమంతు నాయుడు



ధరూర్,(జనంసాక్షి); గద్వాల నియోజకవర్గంలోని ధరూర్ మండల కేంద్రంలో నూతనంగా నిర్మించనున్న వాల్మీకి మహర్షి ఆలయ నిర్మాణానికి మాజీ జడ్పీటీసీ బాసు శ్యామల హనుమంతు నాయుడు రూ.1,00,116 (ఒక లక్ష నూట పదహారు రూపాయలు) విరాళంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో రాజారెడ్డి, వెంకటేష్ నాయుడు, లక్ష్మీకాంత్ రెడ్డి, గంగాధర్, జయరాముడు, వీరేష్, రాము, నరసింహులు, మోహన్, మహేష్, వాల్మీకి కమిటీ సభ్యులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మాటలతో కాదు.. చేతల్లో అభివృద్ధి చేసి చూపిస్తాం!

- గత పదేళ్లలో చేయలేని పనులను మూడేళ్లలో పూర్తి చేస్తాం
- మాజీ ఎమ్మెల్యే విమర్శలకు ఎమ్మెల్యే సంజీవరెడ్డి సవాల్



నారాయణఖేడ్, నవంబర్ 11 (జనంసాక్షి): నియోజకవర్గ అభివృద్ధిపై రాజకీయ విమర్శలు చేయడం మానుకుని క్షేత్రస్థాయి వాస్తవాలు తెలుసుకోవాలని ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్ రెడ్డికి సూచించారు. గత పదేళ్లలో పూర్తి చేయలేని అభివృద్ధి పనులను కాంగ్రెస్ ప్రభుత్వం మూడేళ్లలో పూర్తి చేసే లక్ష్యంతో ముందుకు సాగుతోందని స్పష్టం చేశారు. బుధవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు రూ.200 కోట్లతో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. 350 ఎకరాల అటవీ భూమిని రూ.5 కోట్లతో అర్బన్ ఫారెస్ట్ పార్కుగా అభివృద్ధి చేయనున్నట్లు వెల్లడించారు. రూ.5 కోట్లతో ఇండోర్, అవుట్‌డోర్ స్టేడియం, రూ.47 కోట్లతో ఏటీసీ సెంటర్, రూ.2 కోట్లతో సాయిల్ టెస్టింగ్ ల్యాబ్, రూ.5 కోట్లతో కమలాపూర్ చెరువులో బోటింగ్ సదుపాయాలు కల్పించనున్నట్లు వివరించారు.

సింగూరు నుంచి నల్లవాగు వరకు రూ.65 కోట్లతో కెనాల్ నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయని, త్వరలో ఉత్తర్వులు వెలువడనున్నాయని తెలిపారు. ఈ ప్రాజెక్టుతో సాగు, తాగునీటి సమస్యలకు పరిష్కారం లభిస్తుందన్నారు. నారాయణఖేడ్ పట్టణంలో రూ.16.28 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామని, మంగల్‌పేట నుంచి రాజీవ్ చౌక్ వరకు రూ.15 కోట్లతో డ్రైనేజీలు, సీసీ రోడ్లు, రోడ్డు విస్తరణ పనులు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. రింగ్‌రోడ్డు నిర్మాణం రైతుల అంగీకారం, సహకారంతోనే చేపడతామని స్పష్టం చేశారు.

బానాపూర్, జి.హుక్రా, వెంకటాపూర్ గ్రామాలకు సంబంధించిన రూ.1.65 కోట్ల నిధుల దుర్వినియోగం ఆరోపణలపై విచారణకు సిద్ధమని తెలిపారు. వర్క్ ఆర్డర్లు, బిల్లులు, మెజర్‌మెంట్ బుక్స్, జియో ట్యాగింగ్ ఆధారాలను పరిశీలించాలని సూచించారు. గత పదేళ్ల పాలనలో జరిగిన భూ వ్యవహారాలు, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కేటాయింపులు, ప్రభుత్వ భూముల పంపిణీపై మాజీ ఎమ్మెల్యే సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహకారంతో మరిన్ని నిధులు తీసుకొచ్చి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని, రాజకీయ విమర్శలకు భయపడేది లేదని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. సమావేశంలో మున్సిపల్ కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



బాచేపల్లి ఆరోగ్య ఉపకేంద్రాన్ని తనిఖీ చేసిన వైద్యాధికారి

నిజాంపేట్, నవంబర్ 11 (జనంసాక్షి): నిజాంపేట్ మండలం బాచేపల్లి ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రాన్ని వైద్యాధికారి డాక్టర్ జేబా బుధవారం తనిఖీ చేశారు. ఉపకేంద్రంలోని యు పి ఐ సెషన్లు, రికార్డులు, రిజిస్టర్లను పరిశీలించి, మందుల నిల్వలను, గడువు ముగిసిన మందులను తనిఖీ చేశారు. అనంతరం హెల్త్ సబ్ సెంటర్ సిబ్బంది, ఆశా కార్యకర్తలతో సమీక్ష నిర్వహించి రోగులకు, గర్భిణులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని పలు సూచనలు చేశారు ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం రేణుక,ఆశ వర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌నినోతో నీటి ఎద్దడి ముప్పు.. నీటి పొదుపుపై రైతులకు అవగాహన



పెద్దశంకరంపేట, నవంబర్ 11 (జనంసాక్షి): ఎల్‌నినో ప్రభావంతో రానున్న ఆరు నెలల్లో నీటి ఎద్దడి ఏర్పడే అవకాశం ఉన్నందున నీటిని పొదుపుగా వినియోగించుకోవాలని అధికారులు సూచించారు. మండలంలోని చీలపల్లి, దానంపల్లి గ్రామాల్లో నీటి సంరక్షణపై ప్రత్యేక సదస్సులు, గ్రామసభలు నిర్వహించారు.

ఎంపీఓ జాకీర్ హుస్సేన్ మాట్లాడుతూ యాసంగిలో వరికి బదులుగా జొన్న, పెసర, మినుము, మొక్కజొన్న, కుసుమ, నువ్వుల వంటి ఆరుతడి పంటలు సాగు చేయాలని సూచించారు. పామాయిల్ సాగుతో దీర్ఘకాలిక ఆదాయం పొందవచ్చన్నారు. ఏపీఓ సంతోష్ మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం ద్వారా ఫామ్ పాండ్స్, సోక్ పిట్స్ నిర్మాణం, బోరుబావుల రీఛార్జ్‌పై అవగాహన కల్పించారు. మిషన్ భగీరథ అధికారులు తాగునీటిని వృథా చేయవద్దని కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ నారాయణ, వ్యవసాయ అధికారి నాగం కృష్ణ, ఏఈఓ అఖిల్, సర్పంచులు శంకర్, కవిత, అధికారులు, రైతులు పాల్గొన్నారు.

క్యాన్సర్‌ను తొలి దశలోనే గుర్తించాలి



గుమ్మడిదల, నవంబర్ 11 (జనంసాక్షి): మహిళలు రొమ్ము క్యాన్సర్‌పై నిర్లక్ష్యం చేయకుండా ముందస్తు వైద్య పరీక్షలు చేయించుకోవాలని వైద్యులు సూచించారు. మండలంలోని అనంతారం గ్రామంలో యూసి బెస్ట్ ఫౌండేషన్, ఏఐజీ హాస్పిటల్, తెలంగాణ ప్రభుత్వం, గ్రామ్యూల్స్ కంపెనీ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత రొమ్ము క్యాన్సర్ పరీక్షల శిబిరాన్ని సర్పంచ్ కొమ్ము శీను ప్రారంభించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి డాక్టర్ ఎస్. మధుకర్ మాట్లాడుతూ 40 ఏళ్లు పైబడిన మహిళలు ఉచిత పరీక్షలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. క్యాన్సర్‌ను తొలి దశలో గుర్తిస్తే మెరుగైన చికిత్స సాధ్యమవుతుందని తెలిపారు. కార్యక్రమంలో సీజీఆర్ ట్రస్ట్ చైర్మన్ చిమ్ముల గోవర్ధన్ రెడ్డి, వైద్యులు, ప్రజాప్రతినిధులు, గ్రామ మహిళలు పాల్గొన్నారు.

మల్దకల్‌లో న్యాయ విజ్ఞాన సదస్సు



మల్దకల్, నవంబర్ 11 (జనంసాక్షి): మండలంలోని పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించేందుకు న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి నిష్కా పాత్రుడు బాలల హక్కులు, గుడ్ టచ్-బ్యాడ్ టచ్, లైంగిక వేధింపులు, బాల్యవివాహాలు, బాల కార్మిక వ్యవస్థ, మహిళలు, బాలికల రక్షణ చట్టాలు, పోక్సో చట్టంపై వివరించారు. అన్యాయం, వేధింపులు ఎదురైతే భయపడకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, అధికారుల సహాయం తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈఓ జి. సురేష్, ఇన్‌చార్జి హెచ్ఎం రాజేశ్వర్ రెడ్డి, సర్పంచ్ చిట్టెమ్మ గోపాల్, లీగల్ వాలంటీర్ నరేందర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విత్తన వ్యాపారులు వరి ధాన్యం విక్రయించవద్దు

- తాహసిల్దార్ చంద్రశేఖర్ రెడ్డి



తూప్రాన్, నవంబర్ 11(జనంసాక్షి): ఎల్‌నీనో ప్రభావం ఉన్నందున విత్తన వ్యాపారులు వరి ధాన్యం విత్తనాలను విక్రయించవద్దని తూప్రాన్ తహసిల్దార్ చంద్ర శేఖర్ రెడ్డి విత్తన వ్యాపారులను ఆదేశించారు.

తూప్రాన్ పట్టణ, మండల పరిధిలోని ఎరువులు, విత్తనాల దుకాణాలను తహసీల్దార్ చంద్రశేఖర్ రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. దుకాణాల్లోని స్టాక్ రిజిస్టర్లను, నిల్వలను క్షుణ్ణంగా పరిశీలించారు.

ఈ సందర్భంగా తహసీల్దార్ చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ. ఎల్-నినో ప్రభావం కారణంగా వర్షపాతం తగ్గి ఉన్నందున, రైతులకు వరి విత్తనాలను విక్రయించవద్దని డీలర్లను ఆదేశించారు. వరి పంటకు ఎక్కువ నీరు అవసరం అవుతుంది కాబట్టి, ప్రస్తుత వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులు నష్టపోకుండా ఉండేందుకు డీలర్లు రైతులకు తగిన అవగాహన కల్పించాలని సూచించారు.

వరికి బదులుగా తక్కువ నీటితో పండే ఆరుతడి పంటలు ,పప్పు ధాన్యాలు , కూరగాయల సాగు వైపు రైతులను ప్రోత్సహించాలని వ్యాపారులకు స్పష్టం చేశారు. నీటి కొరత పరిస్థితులను తట్టుకునేలా రైతాంగానికి సరైన సలహాలు అందించాలని, వ్యాపారులు రైతులు ఈ వర్షాభావ పరిస్థితుల్లో పరస్పరం సహకరించుకోవాలని తహసిల్దార్ విజ్ఞప్తి చేశారు.

పేదల సొంతింటి కలను సాకారం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

- మాట ఇచ్చాం.. నిలబెట్టుకుంటున్నాం.. పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం..!
- ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశంలో ఆత్మ కమిటీ చైర్మన్ రామలింగారెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సువర్ణ మల్లన్న పాటిల్



కోహీర్, నవంబర్ 11 (జనంసాక్షి): పేదల సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని, నిరుపేదలకు సొంతింటి కలను సాకారం చేయడమే లక్ష్యంగా ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తోందని ఆత్మ కమిటీ చైర్మన్ రామలింగారెడ్డి, కోహీర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సువర్ణ మల్లన్న పాటిల్ అన్నారు. ఇచ్చిన మాట ప్రకారం ప్రజలకు సంక్షేమ పథకాలను అందిస్తూ, పేదల జీవితాల్లో వెలుగులు నింపేందుకు ప్రజా ప్రభుత్వం కృషి చేస్తోందని పేర్కొన్నారు. బుధవారం సంగారెడ్డి జిల్లా కోహీర్ మండల పరిధిలోని పిచేరేగడి గ్రామంలో తొరమామిడి యాదయ్య కుటుంబానికి మంజూరైన ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ కార్యక్రమంలో వారు పాల్గొని నూతన గృహాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా లబ్ధిదారుల కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేసి, నూతన గృహంలో సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు.

అనంతరం వారు మాట్లాడుతూ.. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం పేదల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందన్నారు. నిరుపేదలకు సొంత ఇల్లు అనేది కేవలం నివాసం మాత్రమే కాదని, అది వారి ఆత్మగౌరవానికి, భద్రతకు, భవిష్యత్తుకు భరోసా అని అన్నారు. ఎన్నో ఏళ్లుగా సొంతింటి కోసం ఎదురుచూస్తున్న పేద కుటుంబాల కలలను నెరవేర్చేందుకు ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తోందని వివరించారు.

కాంగ్రెస్ పార్టీకి పేదల సంక్షేమం కొత్త కాదని, పేదలకు భూములు పంపిణీ చేసిన ఘనమైన చరిత్ర కాంగ్రెస్ పార్టీదేనని గుర్తు చేశారు. ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ, అర్హులైన ప్రతి పేద కుటుంబానికి సంక్షేమ ఫలాలు అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా పేద కుటుంబాల్లో కొత్త ఆశలు చిగురిస్తున్నాయని, సొంతింటి కల నెరవేరడంతో వారి జీవితాల్లో సంతోషం వెల్లివిరుస్తోందని అన్నారు. ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలను అర్హులైన లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు హర్షద్, జె. అనంతరాం, రియాజుద్దీన్, ఫక్రుద్దీన్, పాండురంగారెడ్డి, చెరంగివి, కర్ణాకర్ రెడ్డి తదితర కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి శిక్షణకు ఎంపికైన ఉప్పరిపల్లి సర్పంచ్



ఉప్పునుంతల, నవంబర్ 11 (జనంసాక్షి): రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో మహిళా సర్పంచుల కోసం నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి శిక్షణ కార్యక్రమానికి ఉప్పరిపల్లి సర్పంచ్ బొజ్జ గీతా అమరేందర్ రెడ్డి ఎంఎ కయ్యారు. హైదరాబాద్‌లోని డాక్టర్ ఎం.సి.ఆర్. మానవ వనరుల అభివృద్ధి కేంద్రంలో ఈ నెల 10 నుంచి 12వ తేదీ వరకు మూడు రోజులపాటు శిక్షణ నిర్వహిస్తున్నారు.

సమాచార హక్కు చట్టం అమలు, గ్రామసభల నిర్వహణ, పంచాయతీ పరిపాలన, మహిళా ప్రజాప్రతినిధుల సామర్థ్య పెంపు తదితర అంశాలపై శిక్షణ ఇస్తున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఈ కార్యక్రమంలో మహిళా సర్పంచుల తరఫున ఆయనకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపినట్లు గీతా అమరేందర్ రెడ్డి పేర్కొన్నారు. ప్రతి జిల్లా నుంచి ఇద్దరు మహిళా సర్పంచులను ఎంపిక చేశారు. ఆమె ఎంపికపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

పారదర్శకంగా వేగవంతంగా భూ సర్వే పనులు పూర్తి చేయాలి

- **జిల్లా అదనపు కలెక్టర్ బి.చెన్నయ్య**



ఊర్కొండ, నవంబర్ 11 (జనంసాక్షి);

ఉర్కొండ మండలంలోని జకీనాలపల్లి గ్రామంలో జరుగుతున్న భూముల రీ సర్వే కార్యక్రమాన్ని నాగర్ కర్నూల్ జిల్లా అదనపు కలెక్టర్ (రెవిన్యూ) బి. చెన్నయ్య సందర్శించి సర్వే పనులను పరిశీలించారు.

ఈ సందర్భంగా రీ సర్వే పనులు ఏ విధంగా జరుగుతున్నాయో అధికారులను, సర్వే సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా, పారదర్శకంగా, వేగవంతంగా సర్వే పనులు పూర్తి చేయాలని సిబ్బందికి సూచించారు. రైతుల సమస్యలను కూడా అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జిపిఓ సునీత, డిటి అజయ్ కుమార్ రెడ్డి, సర్పంచ్ కదిరే శేఖర్ యాదవ్, సర్వే సిబ్బంది శివరంజన్, సుధ, రైతులు వెంకటయ్య, రామస్వామి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

బాలానగర్

సమీపంలో జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదం!

- **లారీని వెనుక నుంచి ఢీకొన్న కారు.. దంపతులకు గాయాలు!**



బాలానగర్, నవంబర్ 11(జనంసాక్షి): మహబూబ్‌నగర్ జిల్లా బాలానగర్ సమీపంలోని 44వ జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న దంపతులు గాయపడ్డారు. క్షతగాత్రులు కడప జిల్లా కమలాపురం ప్రాంతానికి చెందినవారిగా పోలీసులు గుర్తించారు.



కడప నుంచి హైదరాబాద్‌కు కారులో వెళ్తుండగా మార్గ మధ్యలో ముందు వెళ్తున్న లారీని కారు వెనుక నుంచి బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో కారు ముందు భాగం పూర్తిగా దెబ్బతినగా, కారులో ప్రయాణిస్తున్న దంపతులకు గాయాలయ్యాయి.

ప్రమాదం కారణంగా జాతీయ రహదారిపై వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడి భారీగా ట్రాఫిక్ జామ్ నెలకొంది. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

రైతు సంఘం జాతీయ మహాసభలను జయప్రదం చేయండి



మాగనూర్, నవంబర్ 12 (జనంసాక్షి): ఈనెల 15 నుంచి 18 వరకు నల్లగొండలో జరిగే అఖిల భారత రైతు సంఘం 36వ జాతీయ మహాసభలను విజయవంతం చేయాలని ప్రజాసంఘాల నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు మాగనూర్ మండల కేంద్రంలో వాల్‌పోస్టర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు పుంజనూరు ఆంజనేయులు, సీఐటీయూ జిల్లా నాయకుడు భరత్ కుమార్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల రైతు, కార్మిక, ప్రజావ్యతిరేక విధానాలను ప్రతిఘటించాలని కోరారు. నవంబర్ 15న లక్షలాది మందితో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. స్వామినాథన్ కమిషన్ సిఫారసుల ప్రకారం కనీస మద్దతు ధర అమలు చేయాలని, ఎల్‌నినోతో నష్టపోయిన వాణిజ్య పంటలకు ఎకరాకు రూ.50 వేలు, ఆహార పంటలకు రూ.30 వేల పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ, రైతు సంఘం, సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.

పల్లె ప్రకృతి వనంలోని చెట్ల నరికివేతపై విచారణ జరిపించాలి....

- **సబ్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన మాజీ సర్పంచ్ పుట్టి లింగమ్మ సాలమోన్...**





నారాయణఖేడ్, నవంబర్ 11 (జనంసాక్షి): సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ మండలం అంత్వార్ గ్రామంలోని పల్లె ప్రకృతి వనంలో చెట్ల నరికివేతపై సమగ్ర విచారణ జరిపించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ పుట్టి లింగమ్మ సలామెన్ సబ్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.

ఈ సందర్భంగా ఆయన తన ఫిర్యాదులో పేర్కొన్న వివరాల ప్రకారం.. అంత్వార్ గ్రామంలో గత ప్రభుత్వ మాయలో 6 సంవత్సరాల క్రితం 1 లక్ష 80 వేలు మొక్కలకు ఖర్చు కాగా , ఫినిషింగ్ , మట్టికి కలిపి 1 లక్ష రూపాయలు ఏర్పాటు ఖర్చు చేశామని తెలిపారు. మామిడి, కొబ్బరి, జామ , వైట్ యాపిల్, ఆక్సిజన్ చెట్లను 400 చెట్లను పల్లె ప్రకృతి వనంలో పెంచామన్నారు. మూడు నెలల క్రితం ప్రస్తుతం సర్పంచ్ చెన్ బసవ కుమార్ రాత్రి సమయంలో నరికి, జెసిబి సాయంతో పూర్తిగా చెట్లను తీసివేసి నష్టపరిచినట్లు ఆరోపించారు. ప్రభుత్వ నిధులు నష్టపరిచిన సర్పంచ్ పై వెంటనే చర్యలు తీసుకొని గ్రామానికి భూమిని వదలాలని కోరారు. గతంలో గ్రామ కంఠం భూమికి సంబంధించిన 0.10 గుంటల భూమిని గ్రామపంచాయతీకి అప్పగించగా, ఆ భూమిలో చెట్లను పెంచినట్లు తెలిపారు. అయితే ప్రస్తుతం ఆ చెట్లను నరికివేయడం వల్ల పల్లె ప్రకృతి వనం దెబ్బతిన్నదని ఫిర్యాదులో పేర్కొన్నారు.

ఈ ఘటనపై సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ జరిపి, చెట్ల నరికివేతకు కారణమైన వారిని గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలని సబ్ కలెక్టర్‌ను కోరారు. వెంటనే గ్రామ కంఠం స్థలంలో చెట్లను పెంచి గ్రామ అభివృద్ధికి తోడ్పడాలని కోరారు.

అర్హులందరికీ నూతన రేషన్ కార్డులు మంజూరు: గ్రంథాలయ చైర్మన్ జి.అంజయ్య

- **పలు గ్రామాలలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ**



రాయికోడు, నవంబర్ 11 (జనంసాక్షి): రాష్ట్ర ప్రభుత్వం అర్హులందరికీ న్యూరేషన్ కార్డులను మంజూరు చేస్తుందని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ జి అంజయ్య స్పష్టం చేశారు.రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆదేశాల మేరకు బుధవారం మండల పరిధిలోని సింగీతం, హస్నాబాద్, రాయిపల్లి, ఇందూరు, మామిడిపల్లి, కర్చల్ నాగంపల్లి, పిప్పడుపల్లి తదితర గ్రామాలలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు కేదార్నాథ్ పాటిల్, తాజా మాజీ జెడ్పిటిసి మల్లికార్జున పాటిల్, తాసిల్దార్ శ్రీమతి ఆశాజ్యోతి, పలువురు నాయకులతో కలిసి లబ్ధిదారులకు స్మార్ట్ ఈరేషన్ కార్డులను పంపిణీ చేశారు. అనంతరం ఆయా గ్రామాల సర్పంచ్ల అధ్యక్షతన జరిగిన చైర్మన్ అంజయ్య మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన వారందరికీ నూతన రేషన్ కార్డుల దరఖాస్తులకు అవకాశం కల్పించిందన్నారు. ఆయా గ్రామాలలో సుమారు 2వేల స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేసినట్లు ఆయన తెలిపారు.ఈ ఆయా గ్రామాల్లో నిర్వహించిన కార్యక్రమంలో వీరభద్రేశ్వర దేవాలయ కమిటీ చైర్మన్ సతీష్ కుల కరణి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ వినయ్ కుమార్, మాజీ వైస్ చైర్మన్ మహంకాళి, మండల కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు బసవరాజ్ పటేల్, సి డి సి మాజీ చైర్మన్ శశికాంత్ పాటిల్, సీనియర్ నాయకులు సుభాష్ పాటిల్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు విదర్శన్ రెడ్డి, మాజీ అధ్యక్షులు ప్రభాకర్, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ నాగిశెట్టి, ప్రధాన కార్యదర్శి ఎండి రఫీక్, నాయకులు ఎండి సుల్తాన్, ఆర్ రాజ్ కుమార్,ఆయా గ్రామాల సర్పంచులు, రేషన్ డీలర్లు, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.


హైకోర్టు ఆదేశాలు బేఖాతర్.. కొత్త పర్సన్ ఇన్‌చార్జి నియామకంపై వివాదం



మహబూబ్‌నగర్ అర్బన్, నవంబర్ 11 (జనంసాక్షి): జిల్లా మత్స్య పారిశ్రామిక సహకార సంఘం పర్సన్ ఇన్‌చార్జి మార్పు వివాదాస్పదంగా మారింది. గోనెల శ్రీనివాసులు ముదిరాజ్‌ను ఎన్నికైన మేనేజింగ్ కమిటీ బాధ్యతలు చేపట్టే వరకు కొనసాగించాలని తెలంగాణ హైకోర్టు అక్టోబర్ 7, 2026న W.P. No.33746 of 2026లో ఆదేశించింది. అయినప్పటికీ నవం బర్ 10న జిల్లా మత్స్యశాఖ అధికారి డి. రాధారోహిణిని కొత్త పర్సన్ ఇన్‌చార్జిగా నియమించి, ఆమె బాధ్యతలు స్వీకరించినట్లు వార్తలు వెలువడ్డాయి.

హైకోర్టు ఉత్తర్వులు అమల్లో ఉండగా ఈ నియామకానికి చట్టపరమైన ఆధారం ఏమిటి? కోర్టు ఆదేశాలను సవరించే తదుపరి ఉత్తర్వులు ఉన్నాయా? నియామకానికి అనుమతించిన అధికారులు ఎవరు? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. కోర్టు ఉత్తర్వుల ఉల్లంఘన జరిగినట్లు తేలితే కోర్టు ధిక్కరణ చట్టం ప్రకారం చర్యలు తీసుకునే అవకాశం ఉంది. ఈ వ్యవహారంపై జిల్లా కలెక్టర్, మత్స్యశాఖ, సహకార శాఖ ఉన్నతాధికారులు విచారణ జరిపి నియామక చట్టబద్ధతపై స్పష్టత ఇవ్వాలని మత్స్యకారులు కోరుతున్నారు.

విద్యారంగ అభివృద్ధికి ఆజాద్ సేవలు చిరస్మరణీయం



వనపర్తి, నవంబర్ 11 (జనంసాక్షి):

భారతదేశ తొలి విద్యాశాఖ మంత్రిగా దేశ విద్యారంగ అభివృద్ధికి విశేష కృషి చేసిన మహనీయుడు మౌలానా అబుల్ కలాం ఆజాద్ అని అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఖీమ్యా నాయక్ కొనియాడారు. బుధవారం వనపర్తి జిల్లా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (ఐడీఓసీ)లో మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ ఆజాద్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.

అనంతరం ఆయన మాట్లాడుతూ.. మౌలానా అబుల్ కలాం ఆజాద్ స్వాతంత్ర్య సమరయోధుడిగా, గొప్ప విద్యావేత్తగా, దార్శనిక నాయకుడిగా దేశానికి ఎనలేని సేవలు అందించారని పేర్కొన్నారు. స్వాతంత్ర్య ఉద్యమంలో కీలక పాత్ర పోషించడమే కాకుండా, స్వతంత్ర భారతదేశంలో విద్యారంగ అభివృద్ధికి బలమైన పునాదులు వేశారని తెలిపారు. దేశంలోని ప్రతి ఒక్కరికీ నాణ్యమైన విద్య అందించాలనే లక్ష్యంతో ఆయన చేసిన కృషి చిరస్మరణీయమన్నారు. విద్య ద్వారానే సమాజంలో సమానత్వం, అభివృద్ధి సాధ్యమవుతాయని ఆజాద్ విశ్వసించారని, ఆయన ఆశయాలు నేటి తరానికి ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ ఆయన జీవితాన్ని, సేవలను స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో మైనారిటీ సంక్షేమ అధికారి సిరాజుద్దీన్, బీసీ సంక్షేమ అధికారి ప్రమీల, జిల్లా పౌర సంబంధాల అధికారి సీతారాం, కార్మిక శాఖ అధికారి రవి, ఎస్సీ సంక్షేమ అధికారి రాంజీరావు, గిరిజన సంక్షేమ అధికారి మధు, ప్రజా సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలు తెరిచారు.. ధాన్యం కొనడం మరిచారు!

• రైతుల కష్టాలు పట్టించుకోని ప్రభుత్వం.. కొనుగోళ్లు ప్రారంభించే వరకు పోరాటం: మాజీ ఎమ్మెల్యే భూపాల్ రెడ్డి



నారాయణఖేడ్, నవంబర్ 11 (జనంసాక్షి): రైతు సంక్షేమం పేరుతో గొప్పలు చెప్పుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం క్షేత్రస్థాయిలో రైతులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోందని మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్ రెడ్డి విమర్శించారు. నియోజకవర్గంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి నెలలు గడుస్తున్నా ఇప్పటివరకు ఒక్క ధాన్యం గింజ కూడా కొనుగోలు చేయకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు.

నారాయణఖేడ్ మండలం వెంకటాపూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన సందర్శించి రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి ఫొటోలకు పరిమితం అవుతున్నారని, ధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మండిపడ్డారు. ప్రభుత్వ కొనుగోళ్లు లేక రైతులు ఇబ్బందులు పడుతుండగా, ప్రైవేటు వ్యాపారులు ధాన్యం కొనుగోలు చేయడానికి ముందుకొస్తే వారిని కూడా అడ్డుకుంటున్నారనే ఆరోపణలు వస్తున్నాయని తెలిపారు. దీంతో రైతులు తమ పంటను ఎవరికి అమ్ముకోవాలో తెలియక ఆందోళన చెందుతున్నారన్నారు.

విద్యుత్, సాగునీటి సమస్యలతో ఇప్పటికే దిగుబడులు తగ్గి నష్టపోయిన రైతులకు పండించిన ధాన్యం అమ్ముకునే పరిస్థితి లేకపోవడం బాధాకరమన్నారు. స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి రైతుల సమస్యల పరిష్కారానికి ఎందుకు చొరవ చూపడం లేదని ప్రశ్నించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో రైతుబంధు, రైతుబీమా, 24 గంటల ఉచిత విద్యుత్ వంటి పథకాలు అమలయ్యాయని గుర్తుచేశారు.

ప్రభుత్వానికి డిమాండ్....

నియోజకవర్గంలోని అన్ని కొనుగోలు కేంద్రాల్లో వెంటనే ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించాలని, ప్రతి గింజను మద్దతు ధరకు కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. కొనుగోలు చేసిన ధాన్యానికి సంబంధించిన డబ్బులతో పాటు ప్రకటించిన బోనస్‌ను కూడా వెంటనే రైతుల ఖాతాల్లో జమ చేయాలని కోరారు. రైతులకు న్యాయం జరిగే వరకు బీఆర్ఎస్ పార్టీ పోరాటం కొనసాగిస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మచ్చేందర్ ముదిరాజ్, విట్టల్, బక్షిరామ్ నాయక్, మల్గొండ, కేశన్న, మారుతి, సీతిబాయి, దేవుళ్ల నాయక్, పలువురు రైతులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్య మనుగడకు ఓటు హక్కు కీలకం: మండల విద్యాధికారి తగిరెడ్డి దేశిరెడ్డి

• నంగునూరులో మండలస్థాయి వ్యాసరచన, ప్రశ్నోత్తర పోటీలు



నంగునూరు, నవంబరు 11 (జనంసాక్షి): ప్రజాస్వామ్య వ్యవస్థ మనుగడకు ఓటు హక్కు అత్యంత కీలకమని మండల విద్యాధికారి తగిరెడ్డి దేశిరెడ్డి అన్నారు. ప్రతి పౌరుడు ఓటు విలువను గుర్తించి బాధ్యతాయుతంగా వినియోగించుకోవాలని సూచించారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు విద్యార్థుల్లో ఓటరు చైతన్యం, ప్రజాస్వామ్య విలువలపై అవగాహన కల్పించేందుకు బుధవారం నంగునూరులో మండల స్థాయి వ్యాసరచన, ప్రశ్నోత్తర పోటీలు నిర్వహించారు. ఓటరు అక్షరాస్యత సంఘాల ఆధ్వర్యంలో, సిద్దిపేట రెవెన్యూ విభాగాధికారి పర్యవేక్షణలో సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుల వేదిక ఈ పోటీలను నిర్వహించింది.

కార్యక్రమానికి మండల విద్యాధికారి తగిరెడ్డి దేశిరెడ్డి, అంక్షాపూర్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నాగార్జునరెడ్డి, సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుల వేదిక జిల్లా ఆర్థిక కార్యదర్శి వై. రాం గోపాల్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా దేశిరెడ్డి మాట్లాడుతూ ఎన్నికలు ప్రజాస్వామ్యానికి పునాది అని, ఓటు హక్కుతో పాటు పౌరులపై సామాజిక బాధ్యత కూడా ఉందని పేర్కొన్నారు. విద్యార్థులు ఎన్నికల ప్రక్రియపై అవగాహన పెంచుకొని కుటుంబ సభ్యులకు, ప్రజలకు ఓటు ప్రాధాన్యతను వివరించాలని కోరారు.

వై. రాం గోపాల్ రెడ్డి మాట్లాడుతూ ఇలాంటి పోటీలు విద్యార్థుల్లో ఆలోచనా శక్తి, విషయ పరిజ్ఞానం, వ్యక్తీకరణ నైపుణ్యాలను పెంపొందిస్తాయని అన్నారు. నాగార్జునరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు సామాజిక బాధ్యతలను అలవర్చుకోవాలని సూచించారు. పాఠశాలల విభాగం ప్రశ్నోత్తర పోటీల్లో నంగునూరు జెడ్పీహెచ్ఎస్‌కు చెందిన బి. రిష్వంత్ రెడ్డి, అక్కెనపల్లి తెలంగాణ ఆదర్శ పాఠశాలకు చెందిన ఎ. సచిత్ కుమార్ ప్రతిభ కనబరిచారు. వ్యాసరచనలో నర్మెట్ట జెడ్పీహెచ్ఎస్‌కు చెందిన పి. రిష్వంత్, అక్కెనపల్లి పాఠశాలకు చెందిన బి. శ్రీజని ప్రతిభ చాటుకున్నారు.

కళాశాలల విభాగం ప్రశ్నోత్తర పోటీల్లో అక్కెనపల్లి పాఠశాలకు చెందిన పి. అలేఖ్య, బి. కృష్ణవేణి, వ్యాసరచనలో నంగునూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన వి. నిహారిక, అక్కెనపల్లి పాఠశాలకు చెందిన కె.రాహిత్య ప్రతిభ కనబరిచారు. విజేతలను ముఖ్య అతిథులు అభినందించారు. కార్యక్రమంలో సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుల వేదిక నాయకుడు కొత్తపల్లి రవి తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభించిన ఎమ్మెల్యే



మల్దకల్, నవంబర్ 11 (జనంసాక్షి): మండలంలోని బూడిదిపాడు, అమరవాయి, తాటికుంట గ్రామాల్లో నిర్మించిన ఇందిరమ్మ ఇళ్లను గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి బుధవారం ప్రారంభించారు. బూడిదిపాడులో మల్లమ్మ, సురేష్, అమరవాయిలో పాండు, మాసమ్మ, జ్యోతి, మద్దిలేటి, తాటికుంటలో తిమ్మప్ప ఇళ్లను ప్రారంభించి లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గద్వాల నియోజకవర్గానికి మొదటి విడతలో 3,500 ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయని, ఇప్పటికే 2 వేలకుపైగా ఇళ్ల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. లబ్ధిదారులు త్వరగా నిర్మాణాలు పూర్తి చేసుకొని గృహప్రవేశాలు చేయాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ ప్రజాప్రతినిధులు, సర్పంచ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రైతుల సాగునీటి అవసరాలకు ఫారం పాండ్స్ ఎంతో ఉపయోగకరం

• వెల్టూర్‌లో నీటి కుంట పనులు ప్రారంభించిన సర్పంచ్ వెంకటేష్



ఉప్పునుంతల, నవంబర్ 11 (జనంసాక్షి): రైతుల సాగునీటి అవసరాలు తీర్చడంతో పాటు వర్షపు నీటిని నిల్వ చేసి భూగర్భ జలాలను పెంపొందించేందుకు ఫారం పాండ్స్ ఉపయోగపడతాయని వెల్టూర్ సర్పంచ్ చింతోజు వెంకటేష్ అన్నారు. గ్రామానికి చెందిన రైతు గజ్జె సైదులు గౌడ్ పొలంలో ఏర్పాటు చేయనున్న వ్యవసాయ నీటి కుంట పనులను ఆయన ప్రారంభించారు.

ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ వర్షాకాలంలో కురిసే నీటిని కుంటల్లో నిల్వ చేసుకొని అవసరమైన సమయంలో పంటలకు వినియోగించుకోవచ్చని తెలిపారు. దీనివల్ల నీటి కొరత తగ్గి రైతులకు సాగునీటి ఇబ్బందులు తొలగుతాయని పేర్కొన్నారు. రైతులు నీటి సంరక్షణ పనులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ ఇడమోని దేవేందర్, రైతు సైదులు గౌడ్, గ్రామ పెద్దలు, రైతులు పాల్గొన్నారు.

మండల రైతులకు పెసర విత్తనాల పంపిణీ



మాగనూరు, నవంబర్ 11 (జనంసాక్షి): నారాయణపేట జిల్లా మాగనూరు మండల రైతులకు తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం (టీఆర్‌వీకే) ఆధ్వర్యంలో ఎంజీజీజీ-385 రకం పెసర విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా టీఆర్‌వీకే శాస్త్రవేత్త, సమన్వయకర్త డాక్టర్ ఈటెల సత్యనారాయణ మాట్లాడుతూ రైతులు నాణ్యమైన విత్తనాలతో పెసర సాగు చేపట్టి అదనపు ఆదాయం పొందాలని సూచించారు. పప్పుధాన్య పంట అయిన పెసర నేలలో జీవ సంబంధిత నత్రజని స్థిరీకరణకు దోహదపడుతుందని తెలిపారు. పంట మార్పిడిలో పెసర సాగుకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఆధునిక వ్యవసాయ సాంకేతిక పరిజ్ఞానం అందించడం టీఆర్‌వీకే లక్ష్యమని పేర్కొన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి సుదర్శన్ గౌడ్, ఏఈఓ పవన్, వాడ్వట్ సర్పంచ్ రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ నూతన జిల్లా నేతలకు ఘన సన్మానం



గండీడ్, నవంబర్ 11 (జనంసాక్షి): బీజేపీ జిల్లా స్థాయి పదవులు చేపట్టిన నాయకులకు గండీడ్ మండలంలో అభినందన, సన్మాన కార్యక్రమం నిర్వహించారు. వికారాబాద్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు యు. రమేష్ కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొని, జిల్లా కిసాన్ మోర్చా ఉపాధ్యక్షుడిగా నియమితులైన ఎ. నరహరి రెడ్డి, జిల్లా ఎస్సీ మోర్చా ఉపాధ్యక్షుడిగా నియమితులైన పవన్ కుమార్‌లను శాలువాలతో సత్కరించారు.

ఈ సందర్భంగా రమేష్ కుమార్ మాట్లాడుతూ నూతన బాధ్యతలు చేపట్టిన నాయకులు పార్టీ బలోపేతానికి కృషి చేస్తూ, ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యల పరిష్కారానికి పనిచేయాలని సూచించారు. అనంతరం అయ్యప్ప స్వాములకు దీక్షా వస్త్రాలు అందించి, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు క్యాసారం విజయ్ కుమార్ రెడ్డి, శంకర్ నాయక్, గిరమౌని శ్రీనివాస్, కృష్ణ ముదిరాజ్, మల్లేశం, వీరేశం, శ్రీనివాస్, సంతోష్, కాకి నరేష్ తదితర బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పంచాయతీరాజ్ శిక్షణకు ఉప్పరిపల్లి సర్పంచ్ ఎంపిక



అచ్చంపేట, నవంబర్ 11 (జనంసాక్షి): రాష్ట్రస్థాయి పంచాయతీరాజ్ శిక్షణ కార్యక్రమానికి నాగర్‌కర్నూల్ జిల్లా ఉప్పరిపల్లి సర్పంచ్ బొజ్జ గీతా అమరేందర్ రెడ్డి ఎంపికయ్యారు. హైదరాబాద్‌లోని డాక్టర్ ఎం.సి.ఆర్. మానవ వనరుల అభివృద్ధి కేంద్రంలో రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నవంబర్ 10 నుంచి 12 వరకు మూడు రోజులపాటు ఈ శిక్షణ నిర్వహిస్తున్నారు. మహిళా సర్పంచుల నాయకత్వ సామర్థ్యాల పెంపు, సమాచార హక్కు చట్టం (ఆర్టీఐ), గ్రామసభల నిర్వహణ, గ్రామీణాభివృద్ధి అంశాలపై అవగాహన కల్పించనున్నారు. ప్రతి జిల్లా నుంచి ఇద్దరు మహిళా సర్పంచులను ఎంపిక చేయగా, ఉప్పరిపల్లి సర్పంచ్‌కు అవకాశం దక్కింది. ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఈ కార్యక్రమం మహిళా ప్రజాప్రతినిధులకు ఎంతో ఉపయోగకరమని గీతా అమరేందర్ రెడ్డి తెలిపారు. ఆమె ఎంపికపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

జాతీయ స్థాయికి మక్తల్ ఎంజెపి విద్యార్థి ఎంపిక

• రాష్ట్ర స్థాయి క్రీడలలో సత్తా చాటిన 9వ తరగతి విద్యార్థి శివకుమార్

• 600 మీటర్ల పరుగు పందెంలో ద్వితీయ స్థానం



మక్తల్, నవంబర్ 11 (జనంసాక్షి): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ స్టేట్ ఆధ్వర్యంలో హనుమకొండలోని జేఎన్ఎస్ మైదానంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలలో మక్తల్ విద్యార్థి అద్భుత ప్రతిభ కనబరిచారు.

మక్తల్ స్థానిక ఎం.జె.పి.టి.బి.సి.డబ్ల్యూ.ఆర్.ఎస్./జె.సి (ఓల్డ్) పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న కె. శివకుమార్ అండర్-14 విభాగంలో నిర్వహించిన 600 మీటర్ల పరుగు పందెంలో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచారు. ఈ పోటీలలో ద్వితీయ స్థానం సాధించి, మెరిట్ సర్టిఫికేట్ గెలుచుకున్నారు. ఈ అద్భుత విజయంతో ఆయన జాతీయ స్థాయి (నేషనల్స్) పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ బుట్టా శివప్రసాద్ మాట్లాడుతూ.. రాష్ట్ర స్థాయి పోటీలలో సత్తా చాటి, మక్తల్ పాఠశాల, జిల్లా కీర్తిని జాతీయ స్థాయిలో నిలపాలని చూస్తున్న విద్యార్థి శివకుమార్‌ను ప్రత్యేకంగా అభినందించారు. రాబోయే జాతీయ స్థాయి పోటీలలోనూ రాణించి, బంగారు పతకం సాధించాలని ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, పీఈటీలు, సిబ్బంది విద్యార్థికి ఘనంగా శుభాకాంక్షలు తెలిపారు.

బీజేపీ కార్మిక విభాగం

రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా నరేందర్ సాగర్



మక్తల్, నవంబర్ 11 (జనంసాక్షి): భారతీయ జనతా పార్టీ కార్మిక విభాగం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా నరేందర్ సాగర్ నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర కార్మిక విభాగం అధ్యక్షులు అందె శ్రీనివాస్ చేతుల మీదుగా ఆయన నియామక పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా నరేందర్ సాగర్ మాట్లాడుతూ.. కార్మికుల సంక్షేమం కోసం, వారి హక్కుల పరిరక్షణ కోసం, అసంఘటిత రంగ కార్మికుల సమస్యల పరిష్కారంతో పాటు పార్టీ సంస్థాగత బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. తన నియామకానికి ప్రోత్సహించిన పార్టీ పెద్దలకు, నాయకులకు నరేందర్ సాగర్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. గతంలో ఆయన ఏబీవీపీ, బీజేవైఎం లలో వివిధ హోదాల్లో పనిచేశారు. అలాగే రాష్ట్ర లీగల్ సెల్ కన్వీనర్‌గా, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా సమర్థవంతంగా బాధ్యతలు నిర్వర్తించారు. ఈ నియామకం పట్ల పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తూ ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

ధోభీ ఘాట్‌కు రహదారి ఏర్పాటు చేస్తాం...

• **సర్పంచ్ ఆగారం పద్మమ్మ ప్రకాష్**



ఖిల్లా ఘనపురం, నవంబర్ 11(జనంసాక్షి): మండల కేంద్రంలోని ధోభీ ఘాట్‌కు రహదారి సౌకర్యం కల్పిస్తామని స్థానిక సర్పంచ్ ఆగారం పద్మమ్మ ప్రకాష్ తెలిపారు. స్థానిక రజక కులస్తులు తమ జీవనోపాధి కోసం అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో నిర్మించిన ధోభీ ఘాట్‌కు కాలక్రమేణా రాక పోకలకు రహదారి సమస్య ఏర్పడిందని తెలిపారు. ఈ సమస్యను పరిష్కరించేందుకు పక్కనే ఉన్న భూముల యజమానులతో చర్చించి, వారి సహకారంతో ధోభీ ఘాట్‌కు రహదారి ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం చాకలి ఐలమ్మ విగ్రహ ఏర్పాటుకు స్థానిక పాత్రికేయుల భవనం సమీపంలో స్థలాన్ని కేటాయిస్తామని పేర్కొంటూ స్థల పరిశీలన చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి రవికుమార్, రజక సంఘం జిల్లా నాయకులు విజయ్, నగేష్, పాలకొండ నారాయణ, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ

దళిత సెల్ మండల అధ్యక్షులుగా మ్యాతరీ రాములు



ఖిల్లా ఘనపురం, నవంబర్ 11 (జనంసాక్షి): మండల కేంద్రానికి చెందిన మ్యాతరీ రాములు ను కాంగ్రెస్ పార్టీ దళిత సెల్ మండల అధ్యక్షులుగా నియమితులు అయ్యారు ఈ సందర్భంగా మ్యాతరీ రాములు మాట్లాడుతూ.. దళితుల హక్కుల కోసం వారి ప్రయోజనాల కోసం ఎప్పటికీ అందు బాటులో ఉంటూ పార్టీ ఇచ్చిన ఆదేశాలకు కట్టుబడి పనిచేస్తా నని అదేవిధంగా ఎస్సీ సెల్ మండల అధ్యక్షులుగా అవకాశం కల్పించిన ఎమ్మెల్యే మేఘా రెడ్డికి డిసిసి ఉపాధ్యక్షులు టి సాయి చరణ్ రెడ్డి స్థానిక నాయకులు అగారం ప్రకాష్ ఎప్పటికీ రుణపడి ఉంటానని ఈ సందర్భంగా మ్యాతరీ రాములు తెలిపారు.

జాతీయ న్యాయ సేవల దినోత్సవం సందర్భంగా న్యాయ విజ్ఞాన సదస్సులు



మల్దకల్, నవంబర్ 11 (జనంసాక్షి): జాతీయ న్యాయ సేవల దినోత్సవాన్ని పురస్కరించుకొని జోగులాంబ గద్వాల జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో మల్దకల్ మండలంలోని రైతు వేదిక, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో న్యాయ విజ్ఞాన అవగాహన శిబిరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జి. నిష్మా పాత్రుడు మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ న్యాయం అందుబాటులో ఉండాలనే లక్ష్యంతో న్యాయ సేవాధికార సంస్థ పనిచేస్తోందన్నారు. ఆర్థికంగా వెనుకబడినవారు, మహిళలు, పిల్లలు, ఎస్సీ, ఎస్టీలు, దివ్యాంగులకు ఉచిత న్యాయ సహాయం అందుబాటులో ఉందని తెలిపారు. అర్హులు న్యాయవాది ఫీజు చెల్లించకుండానే ఈ సేవలు పొందవచ్చని వివరించారు. విద్యార్థులకు బాలల హక్కులు, మహిళల రక్షణ చట్టాలు, పోక్సో చట్టం–2012పై అవగాహన కల్పించారు. బాలలపై లైంగిక వేధింపులు నేరమని, అలాంటి ఘటనలు ఎదురైతే భయపడకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు తెలియజేయాలని సూచించారు. న్యాయ సహాయం కోసం 15100 టోల్‌ఫ్రీ నంబర్‌ను సంప్రదించాలని తెలిపారు. కార్యక్రమాల్లో సర్పంచ్ చిట్టెమ్మ, పంచాయతీ కార్యదర్శి అర్జున్, పారా లీగల్ వాలంటీర్ నరేందర్, కేజీబీవీ ప్రిన్సిపాల్ విజయలక్ష్మి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అవని హాస్పిటల్ ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలి

• **ప్రారంభోత్సవంలో మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి**



వనపర్తి బ్యూరో, నవంబర్ 11 (జనంసాక్షి): వనపర్తి పట్టణంలోని 29వ వార్డులో నూతనంగా ఏర్పాటు చేసిన అవని హాస్పిటల్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆసుపత్రిని ప్రారంభించి, వైద్యులు డా. జి. శ్రవణ్ కుమార్, డా. కె. అంజనీ ప్రియలకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ పట్టణంలో నూతనంగా ఆసుపత్రి అందుబాటులోకి రావడం సంతోషకరమన్నారు. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడం ఎంతో అవసరమని, ముఖ్యంగా సామాన్య ప్రజలకు మెరుగైన వైద్యం అందుబాటులో ఉండేలా అవని హాస్పిటల్ కృషి చేయాలని ఆకాంక్షించారు. వైద్య వృత్తి సేవాభావంతో కూడుకున్నదని, ప్రజల ఆరోగ్య పరిరక్షణే లక్ష్యంగా వైద్యులు అంకితభావంతో పనిచేయాలని సూచించారు. అవని హాస్పిటల్ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తూ దినదినాభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ఆసుపత్రి వైద్యులు, యాజమాన్యాన్ని అభినందించారు.ఈ కార్యక్రమంలో గట్టు యాదవ్, వాకిటి శ్రీధర్, ఉంగలం తిరుమల్, కౌన్సిలర్లు మురళి సాగర్, ధర్మ నాయక్, శంకర్ నాయక్, జోయబ్ హుస్సేన్, చీర్ల శీను సాగర్, సునీల్ వాల్మీకి, ఇమ్రాన్ బిన్ అలీ, సయ్యద్ ఖాజా, అస్లం, అలీమ్, చిట్యాల రాము, అనుపటి రాము తదితర నాయకులు, ప్రముఖులు పాల్గొన్నారు.

వనపర్తి బీజేపీ మండల ప్రధాన కార్యదర్శిగా వాసిరామ్ నాయక్



వనపర్తి బ్యూరో, నవంబర్ 11 (జనంసాక్షి): వనపర్తి రూరల్ మండల బీజేపీ కమిటీలో నూతన నియామకాలు చేపట్టారు. జిల్లా పార్టీ కార్యాలయంలో రూరల్ మండల బీజేపీ అధ్యక్షుడు సంద వెంకటేష్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శిగా వాసిరామ్ నాయక్‌ను, కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడిగా నీలం రాములును నియమించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు డి. నారాయణ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మెంటేపల్లి పురుషోత్తం రెడ్డి, రామన్న వెంకటేశ్వర్ రెడ్డి, రాకాసి లోకనాథ్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దిరాజు, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు అరవింద్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతనంగా నియమితులైన నాయకులకు పార్టీ నాయకులు శుభాకాంక్షలు తెలియజేశారు. పార్టీ బలోపేతానికి, కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు సమష్టిగా కృషి చేయాలని నాయకులు సూచించారు.ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి వాకిటి సుదర్శన్, మండల ఉపాధ్యక్షుడు రామకృష్ణ నాయక్‌తో పాటు పలువురు బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మైసంపల్లి గ్రామంలో రెవెన్యూ గ్రామసభ..



నంగునూరు, నవంబర్ 11 (జనంసాక్షి): నంగునూరు మండలం మైసంపల్లి గ్రామంలో గ్రామ సర్పంచ్ సోమిరెడ్డి నరేష్ రెడ్డి ఆధ్వర్యంలో గురువారం రెవెన్యూ గ్రామసభను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నంగునూరు మండల తహశీల్దార్ ప్రవీణ్ రెడ్డి తో పాటు డివ్యూటీ ఎమ్మార్వో, ఏడీ సర్వేయర్, మండల ఆర్ఐ, మండల సర్వేయర్, గ్రామ పంచాయతీ కార్యదర్శి, ఉపసర్పంచ్, వార్డు మెంబర్లు, గ్రామ రైతులు మరియు ప్రజలు విశేషంగా పాల్గొన్నారు.
ఈ సందర్భంగా సర్పంచ్ నరేష్ రెడ్డి మాట్లాడుతూ... ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూ రీసర్వే కార్యక్రమాన్ని మైసంపల్లి గ్రామంలో ప్రారంభించడం చాలా సంతోషకరమని పేర్కొన్నారు. టిఫిన్ లేకపోవడం వల్ల ఉత్పన్నమవుతున్న హద్దుల వివాదాలు, పొరుగు గ్రామాల సరిహద్దు సమస్యల పరిష్కారానికి మరియు అన్యాక్రాంతమైన ప్రభుత్వ భూములను కాపాడుకోవడానికి ఈ రీసర్వే ఒక మంచి అవకాశమని ఆయన అభిప్రాయపడ్డారు. అనంతరం గ్రామ ప్రజలు, రైతులు తమ భూములకు సంబంధించి లేవనెత్తిన పలు సమస్యలు, సందేహాలకు రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో వివరణలు ఇస్తూ తగిన సమాధానాలు ఇచ్చారు.



ప్రైవేట్ ఆసుపత్రి వైద్యుల నిర్లక్ష్యానికి రెండు నెలల పసికందు బలి..!



జిల్లాలోని ప్రైవేట్ ఆసుపత్రులపై వైద్య ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని, ఆసుపత్రుల్లో అందిస్తున్న వైద్య సేవలు, వైద్యుల అర్హతలు, అత్యవసర వైద్య సదుపాయాలు, రోగుల పట్ల వ్యవహరిస్తున్న తీరుపై సమగ్ర పరిశీలన చేయాలని విజ్ఞప్తి చేశారు. నిబంధనలు ఉల్లంఘిస్తూ, నిర్లక్ష్యంగా వైద్య సేవలు అందించే ఆసుపత్రుల యాజమాన్యాలు, బాధ్యులైన వైద్యులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

పోలీసుల విచారణ..

ఈ ఘటనపై కోహిర్ టౌన్ ఎస్ఐ నరేష్ మీడియాతో మాట్లాడుతూ.. చిన్నారి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని, సంబంధిత వైద్యుడిని అదుపులోకి తీసుకున్నామని తెలిపారు. ఘటనకు సంబంధించిన అన్ని కోణాల్లో విచారణ కొనసాగుతోందని, పోస్టుమార్టం నివేదికతో పాటు అందుబాటులో ఉన్న వైద్యపరమైన వివరాలను పరిశీలించి తదుపరి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.
రెండు నెలల పసికందు మృతి ఘటనతో కోహిర్ పట్టణంలో ప్రైవేట్ ఆసుపత్రుల్లో వైద్య సేవల నాణ్యత, పర్యవేక్షణ, భద్రతా ప్రమాణాలపై చర్చ మొదలైంది. వైద్య ఆరోగ్యశాఖ అధికారులు స్పందించి వాస్తవాలను వెలికితీసి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.
గమనిక: వైద్య నిర్లక్ష్యం ఆరోపణలు ఇంకా విచారణలో ఉన్నందున, పోస్టుమార్టం నివేదిక మరియు పోలీసుల దర్యాప్తులో నిర్ధారణ అయ్యే అంశాలను తుది వార్తలో స్పష్టంగా చేర్చడం మంచిది.